4767

సంపాదకుడు: శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి   సంవత్సరం చందా ౨—౦—

ప్రబుద్ధాంధ్ర

సంపుటం ౮ }   రాజమండ్రి ౨౧ మే ౧౯౩౫   { ౯ వ సంచిక

ఉదాహరణ

గూడుమారినకొత్తరికం వెల 0—2—0. దానికి పోస్టుఖర్చు 0—0—9 ఈ 0—2—9 లు ముందు మాకు లేబిల్సు ... పంపడానికి కవరు ఖరీదు 0—1—0 కలంపోటుకి, ... ప్రాణాక్రే ఇలాగే లేబిల్సు పంపడానికి ఒక్కొక్క కవరు వెల ఒక్కొక అణా.

ఇదేమి లాభమూ ?

కనక, మాకు, ముందు 2—0—0 పంపండి. పుస్తకాల వెలలకూ, పోస్టేజీకీ అది సరిపోయే దాకా, ఒక్కొక్కటే అచ్చుపడిన వెంటనే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు మీకు పంపుతూ వుంటాము. దీనివల్ల ప్రతీపుస్తకానికీ మీకు అనవసరంగా కవరు ఖర్చు తగలదు

ఇది లాభం కాదూ ?

బాగా ఆలోచించండి

కలాభివర్ధనీపరిషత్తు—రాజమండ్రి

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు

ఇవి యిప్పుడు విడివిడిగా అచ్చు అవుతున్నవి
వెల 100 పేజీలకు 0-4-0 రేటున వుంటుంది
తక్కువ వెల 0-1-0   ఎక్కువ వెల 0-4-0

తయారైనవి

1. గూడుమారిన కొత్తకోడలు వెల 0-2-0
2. కలంపోటు వెల 0-2-6
3. తల్లిప్రాణం వెల 0-2-6

అచ్చులో వున్నవి

1. ఇల్లుపట్టిన వెధవాడబడుచు 2. మార్గదర్శి

ఒక్కొక్క పుస్తకం వీ. పీ. చెయ్యము. వెల, పోస్టేజి రేబిల్సు రూపంగా పంపినవారికి బుక్కుపోస్టుగా పంపుతాము. దీనికీ దానికీ యిలా పంపుతే పోస్టుఖర్చులు ఎక్కువ అయిపోతాయి. కనక ముందు 2-0-0 చందాగా పంపినవారికి వెలకు, పోస్టేజీకి ఆ 2-0-0 సరిపోయేదాకా చిన్నకథలపుస్తకాలు ఒక్కొక్కటి అచ్చు కాగానే పంపుతూ వుంటాము. ఒక సంవత్సరంలో ఈ రెండు రూపాయలూ తీరిపోతాయి.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు
కలాభివర్ధనీ పరిషత్తు రాజమండ్రి

ఆధునికాంధ్రవాఙ్మయం

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారివి

1 రక్షాబంధనం 1-0-0, 2 శ్మశానవాటిక 0-8-0, 3 వారకాంత 0-4-0, 4 గూడుమారిన కొత్తకోడలు 0-2-0, 5 కలంపోటు 0-2-6 6 తల్లిప్రాణం 0-2-6 7 విజయనగరరాజుల కథలు 0-2-0, 8 చిత్తూరు రాజుల కథలు 0-3-0, 9 ఢిల్లీచక్రవర్తుల కథలు, 0-3-0, 10 గోల్కొండనవాబుల కథలు 0-1-0 11 ప్రబుద్ధాంధ్ర అయిదో సంపుటం గ్లేజు కాగితాలు చక్కని బైడింగు 2-0-0.

మునిమాణిక్యం నరసింహారావుగారివి

1 కాంతం కథలు 1-0-0, 2 నేను మా కాంతం 0-4-0, 3 ఉపాధ్యాయుడు 0-8-0, 4 వక్రరేఖ 1-0-0.

మొక్కపాటి నరసింహశాస్త్రిగారివి

1 బారిష్టరు పార్వతీశం వళ్ళా 1-0-0, 2 ప్రతిబింబములు 0-12-0 3 ఏకోదరులు 0-8-0.

రాయప్రోలు సుబ్బారావుగారివి

1 కవితాంజలి 1-0-0, 2 జడకుచ్చులు 1-0-0

కురుగంటి సీతారామయ్యగారివి

తంజాపురాంధ్రనాయక రాజుల చరిత్ర. 2-0-0

R. V. R. జగపతివర్మగారివి

1 పెద్దాపురసంస్థానచరిత్రము 1-0-0, 2 పద్మనాభయుద్ధము 0-12-0, 3 రామవిలాసము 0-10-0, 4 ఆంధ్రులకథలు 0-10-0, 5 ఆంధ్రదేశకథలు 0-12-0.


వేకుమళ్ల అచ్యుతరావుగారివి

విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్ర 1-8-0.

ప్రకీర్ణకాలు

1 మునిమాపు 0-12-0, 2 వకుళమాల 0-12-0, 3 విరిసెజ్జ 0-8-0, 4 వేయిస్తంభాలగుడిశాసనం 2-0-0, 5 మల్లికార్జునరావు 0-10-0, 6 ఆంధ్రహృదయం 0-8-0, 7 రత్నాపణం 0-8-0, 8 రసాంజలి 0-2-0, 9 వసంతము 0-4-0, 10 నాట్యోత్సవం 1-0-0 11 నాట్యాశోకము 1-0-0, 12 విమర్శకపారిజాతం 1-0-0, 13 ఆంధ్రనాటకసంస్కరణము 0-4-0, 14 [illegible] 0-8-0, 15 కవి[illegible] 0-8-0.

కలాభివర్ధనీ పరిషత్తు రాజమండ్రి



సంపుటము ౮] రాజమహేంద్రవరము: ౩౧ మేయి ౧౯౩౮ [౯ వ సంచిక

రా జ రా జు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
సంపాదకుడు

అయిదో రంగము

రాజరాజు విలాసమందిరం.

గడియ కిందటే వచ్చి చిత్రాంగి, సపరివారంగా అందులో విడిసింది.

ఆమె వెంట, చిలక కాక, అరణపు దాసీలు, రుక్కుతో కలిపి మరో యిరవైనుంచి వచ్చారు. పదహారుగురు భృత్యులు కూడా వచ్చారు.

అయితే; రాజమహేంద్రపుర దాసీలూ, జక్కులదీవి భృత్యులూ కింద అంతస్తులోనే వుండిపోవాలనీ, పైకి రాకూడదనీ చిలక నిక్కచ్చిగా ఆజ్ఞాపించింది. జక్కులదీవి అరణపు దాసీలు మాత్రమే పైని వుండి పరిచర్య చేస్తూ వుండేటట్టున్నూ ఆమె యేర్పరిచింది.

అరణపుదాసీలలో కూడా, రుక్కు, తన రాక తెలియపరిచి లోపలకు వెళ్ళవచ్చు. తక్కిన దాసీలు పిలిస్తేగాని లోపలకు వెళ్ళగూడదు.

అప్పటికి రెండు గడియల పొద్దు మాత్రమే వుంది. జక్కులదీవి దాసీలు, సారె సామానులన్నీ యథార్హ్యంగా సర్దుతున్నారు.

చిత్రాంగి, వెనక వసారాలో, బాలీసుకి ఆనుకుని రత్నకంబళీమీద కూచుని వున్నది. గుడికి వెళ్ళిన మేకలా వున్నది; కాని ఆమె కాస్తయినా వుత్సాహంగా లేదు.

పక్కన కూచుని, చిలక, చిత్రాంగి ధరించి వున్న నగలలో అసాధారణమైన వన్నీ వొక్కొక్కటే వొలిచి దంతపు బరిణలో వుంచుతున్నది. ఆమె కూడా పూర్తిగా నిరుత్సాహంగానే వున్నది.

అప్పటికి రెండు గడియల పొద్దు మాత్రమే వుంది.

చిత్రాంగి—అనుభవించడం తప్పనప్పుడు ఉసురుంటే వచ్చిన తప్పేమిటి? నేనిప్పుడు అభిసారిక నయ్యే వున్నాను.

చిలక—(మాట్లాడదు)

చిత్రాంగి—అభిసారిక, ప్రియుణ్ణి వెతుక్కుంటూ సంకేతస్థలానికి వెడుతుంది. నేను తిన్నగా ప్రియుడి యింటికే వచ్చాను. ఈ తేడా మాత్రం వున్నది.

చిలక—(మాట్లాడదు)

చిత్రాంగి—అయితే; ఈసాహసానికి ఫలితం యేమిటి? ఈజన్మకి సాఫల్యం వుంటుందా?

చిలక—(గడ్డం పట్టుకుని చిత్రాంగిని బతిమాలుతూ) వద్దు తల్లీ! గోడలకి చెవులున్నాయి మా అమ్మా!

చిత్రాంగి—ప్రియుడి యింటి గోడలికి కూడా చెవులున్నాయా ?

చిలక—(మాట్లాడదు)

చిత్రాంగి—సాఫల్యం మాట దేవు డెరుగును, ఇక్కడ కూడా యిలాంటి తపన వున్నట్టు తెలిస్తే గాని యీ జతుకు కడ తేరడం యెలాగా ?

చిలక—అది సుఖసుఖాల తేళే విషయమా తల్లీ ? అసలే మహా—గంభీరు లని విను దాయె. ఈసమయాన ఆగాంభీర్యం మరింత గంభీర మయిపోయి వుండదూ ? ఇంతకీ : తమలో తా మయినా మధనపడడానికి వారి కవకాశం వున్నదో లేదో ? సుబుద్ధి అయ్యవారు—(అర్థోక్తి)

చిత్రాంగి—(చెవులు మూసుకుని) శివశివా !...... ఆపే ఇత్తికే. నా ఆశలు కాయో పండో తేలిపోయే దాకా అయినా ఆభూతం నాకళ్లబడకుండా వుండేటట్టు చూడవే.

చిలక—వారు, షష్టిగడియలూ అయ్యవారిని విడిచి వుండ లేని పింటాం గదా, నే నేం చెయ్యగల నమ్మా ?

చిత్రాంగి—(నిరాశతో చేతులు విదుపుకుంటూ) శని......శనిగాడు. ఆదిలోనే వక్రించాడు. ఈసంగతి వా డిప్పటి కయినా గ్రహించుకోకపోతే యేమిటి దారి ?

తెరలో

చిలకా !

చిలక—ఆ ! రావచ్చు.

(అప్పుడు రుక్కు వస్తుంది)

రుక్కు—మహారాజు దయచేశారు. దర్శనం కోరుతున్నారు.

చిత్రాంగి—పల్లకా దని చెప్పు. ఇంకా మించిపోలేదు, యీ పాటికి దయచెయ్యం డని చెప్పెయ్యి.

చిలక—మీ రుండండి తల్లీ ! (రుక్కుతో) ఏమిటే ?

రుక్కు—మహారాజూ, మహారుద్రయ్యగారూ వచ్చారు.

చిలక—ఊహూ !

రుక్కు—మహారాజు మొగం కలకల్లాడిపోతోంది.

చిత్రాంగి—ఆ మొగమ్మీద నిప్పులు పొయ్యి. వెళ్లు.

చిలక—(గడ్డం పట్టుకుని) మా అమ్మ కాదూ ! ఇవాళకి మీ కళ్లబడనివ్వను. మిమ్మల్ని చూడనివ్వను. అవ లిక్కడికి రానివ్వనే రానివ్వను. ఏం, సరా ? ఇక వూరుకోండి అమ్మా !

చిత్రాంగి—(రుక్కుతో) ఎక్కడ వున్నారే ?

రుక్కు—కిందే వున్నారమ్మా !

చిత్రాంగి—(రుక్కుతో) మెట్లమీద కూడా అడుగు పెట్టడానికి వల్లకా దని చెప్పు. (చిలకతో) నువ్వు తొరగా వెళ్లి సాగనంపేసి రా.

చిలక—(లేచి రుక్కుతో) పద వే.

(చిలకా రుక్కూ వెళ్లిపోతారు)

చిత్రాంగి—వచ్చి గడియ కాలేదు. ముసలిరాజప్పుడె సిద్ధం. నాగతి యింతకి వచ్చేసిందా ? హా ! ఆడజన్మ యింత చుక్కనూలినదా ?......కాదు, కాదు. ఎదురుకుంటు మొగాను ఉక్కిరిబిక్కి రయిపోతాడు. నే నెందుకు బెలపోవాలి ? నా బతుకు బుగ్గి చేసేసి, రాజు, తాను మాత్రం యేమి బావుకుంటాడూ ? వీలు తప్పివచ్చేటట్లయితే, యీముసలిపీనుగుని సమూలంగా నాశనం చెయ్యకపోతే నేను చిత్రాంగిని కాను.

(అప్పుడు చిలక వస్తుంది)

చిత్రాంగి—బుద్ధిగా వెళ్లాడూ ?

చిలక—కీ లెరిగి వాత పెడితే వెళ్లక యేం చేస్తారు తల్లీ ?

చిత్రాంగి—ఏం జరిగిందీ ? అసలు, నువ్వే మన్నావూ?

చిలక—ఇది పూజాసమయం అని చెప్పాను.

చిత్రాంగి—(చిటికె వేస్తూ) సెబాస్ !

చిలక—పైగా, వ్రతానికి ఉద్యాపన జరిగేదాకా, తొలీనాడు జాము పొద్దువేళ మొదలు, మలీనాడు జాము పొద్దెక్కే దాకా పురుషుల కళ్లబడగూడ దనికూడా చెప్పాను.

శరు

చిత్రాంగి—దాంతో నవనాడులూ కుంగిపో నేలనట్టేనా ?

ారు)

చిలక—పూర్తిగా కుంగిపోయాయి తల్లీ! మొగమ్మీద కత్తివేస్తే రక్తం లేదు.

చిత్రాంగి—ఇక మిడసరి లగ్నం వేళ వస్తాడు. అంతేనా?

చిలక—అంతే తల్లీ!

చిత్రాంగి—బతికాం, నాలుగు రోజులు తక్కువ—అంతే కాదూ? ఆరు మాసాలు నిర్భయం.

చిలక—అవును తల్లీ! కాని వాళ్ళ పని మాత్రం—(అర్థోక్తి)

చిత్రాంగి—ఏమి టదీ?

చిలక—భోజనం చేసి వొక్కమాటు మహారాణీ దర్శనం చేసుకుని రమ్మన్నారు. అది చాలా అగత్యంట. దానివల్ల చాలా మేళ్ళున్నాయి ట.

చిత్రాంగి—(లేచి) కాదని యెవ రంటారూ? తప్పకుండా దర్శనం చేసుకుందాం. కథ అంతా సవ్యంగా నడిచినా నాకు మొదట లభించేది అత్తయ్యగారి దర్శనమే. కథ అడ్డం తిరిగినా యిప్పుడు వారి దర్శనమే మొదట అవుతున్నది. చాలా సంతోషం. భోజనం కాగానే దర్శనానికి వస్తున్నా మని రుక్కుచేత వర్తమానం పంపు.

చిలక—అలాగే తల్లీ! ఒక్కమాటు అలా తోటలో తిరిగివద్దాం రండమ్మా!

చిత్రాంగి—పద.

చిలక—రుక్కూ!

తెరలో

వచ్చాను.

చిలక—స్నానానికి సకలమూ సిద్ధం చేయించు.

తెరలో

సరే.

చిలక—రండి తల్లీ!

(ఇద్దరూ వెళ్ళిపోతారు)

ఆరో రంగం

రత్నాంగి నగరు. రమారమీ, అది, రాత్రి భోజనాల వేళ. తమక్షీణావు వసారాలో, రత్నాంగీ, విజయాదిత్యుడూ అబ్బాంల తానుకుని వొకరి కొక రెదురుగా కూచుని వున్నారు. రాజపురోహితుడు రుద్రంభట్టు విజయాదిత్యున కొక పక్కగా వొక బాలీసు దగ్గిర కూచుని వున్నాడు.

రంయి మని చల్లని గాలి కొడుతున్నది. ఆగాలికి విజయాదిత్యుని గిరజాలూ, కొంచెం నెరసివున్న రత్నాంగి ముంగురులూ కదులుతున్నవి. ఉండివుండి వొకొక్కరివ్వ, దక్షిణాభిముఖుడై వున్న రుద్రంభట్టుకి కొంచెం వుక్కిరి బిక్కిరి కలిగిస్తున్నది.

ఒక దాసి మైనగోరువంకలకూ, చిలకలకూ పంజరాలలో జామిపళ్లు ంచుతున్నది. గౌరి అనే మరొకదాసి తలుపు ఆనుకుని రత్నాంగికి వెనక నుంచుని వున్నది.

విజయాదిత్యుడు—(రుద్రంభట్టుతో) తమ మాటలు చూస్తే యెటూ నిశ్చయించడానికి వీలులేకుండా వున్నది. పోనీ, యిది సెల విప్పించండి, బాగా జ్ఞాపకం చేసుకోండి. ఆమె, కత్తికి పూలదండ వెయ్యడం విసిరికొట్టినట్టున్నదా, మురుస్తూ—(అర్థోక్తి)

రుద్రంభట్టు—మురిపెమా? అదెలాగ మహాప్రభూ?

రత్నాంగి—తర్కం వద్దు. జరిగినది జరిగినట్టు సెల విప్పించండి బాబయ్యా!

రుద్రంభట్టు—చిత్తం అమ్మా! మనవిచేసుకుంటున్నాను. చిత్రాంగీదేవమ్మగారు, పరిచారిక తెచ్చి అందిచ్చిన ఆయొక్క పుష్పహారం స్వీకరించడమూ, మహారాజులుంగారి కత్తివైపుకి సుతారంగా తిరగడమూ, దానికి— పతిభావనతో టయ్యేవే — చిత్తగించారూ, వెయ్యడమూ, అలాగ వేసే వెయ్యడంతోటట్టే—అది—ఎదీ? ఆయొక్క పూలదండ విచ్ఛిన్నం అయిపోవడమూనున్నూ, నేను విభ్రాంతు ణ్ణాయి—(అర్థోక్తి)

విజయాదిత్యుడు—ఇప్పుడు తమ విభ్రాంతి మనకక్కరలేదు. ఆమె సంగతి సెల విప్పించండి. ఆమె మొగంమీద యే మయినా అయిష్టత కనపడినదా?

రుద్రంభట్టు—శివశివా! శివశివా! అయితే, మహాప్రభూ! ఆదండ తెగిపోవడంతో టట్టే—(అర్థోక్తి)

విజయాదిత్యుడు—తమరు నాప్రశ్న గమనించడం లేదు. వేసిన తరవాత గాని దండ తెగిపోలేదు. ఆవెయ్య

డానికి వెనకటి స్థితి నే నడుగుతున్నది. వేస్తూ వుండి నప్పటిదిన్నీ సెల విప్పించండి.

రుద్రంభట్టు—చిత్తం చిత్తం. అదే విన్నవించుకుంటున్నాను మహాప్రభూ! (స్మరణ అభినయించి) చూపులలో కొంచెం నైశిత్యం కనపడింది. లజ్జ మాత్రం స్ఫుటంగా లేదు. సాధ్వసమున్నూ గోచరించలేదు. అలా అని అది అయిష్టత అనిన్నీ చెప్పడానికి వీలు లేకుండా వున్నది. పైగా, ఆపుష్పహారం యెత్తడంలో ఆమె యెదమజబ్బ అడ్డు రావడంవల్ల కళ్లల్లో యెలాంటి భావం—(అర్థోక్తి)

రత్నాంగి—సరే లెండి. ఏదో అయింది. తమకి భోజనంవేళ అతిక్రమిస్తూ వుంది. తమర్ని శ్రమపెట్టాము.

రుద్రంభట్టు—అమ్మ అమ్మ! ఎంత మాట సెలవిచ్చారు? ఇందులో నాకు వచ్చిన శ్రమ యేమి వున్నదీ?

(ఈసమయంలో రత్నాంగి, వెనక్కి గౌరి కేసి చూస్తుంది. వెంటనే గౌరి పళ్లెంతో ఫలాలూ తాంబూలమూ తెచ్చి రత్నాంగి యెదట వుంచుతుంది)

రత్నాంగి—(ఆపళ్లెం పుచ్చుకుని, లేచివెళ్లి భక్తితో రుద్రంభట్టుకి అందించి నమస్కరిస్తుంది.)

రుద్రంభట్టు—(లేచి, వినయంగా పళ్లెం అందుకుని, తాపీగా వొత్తుసాదులు స్ఫుటంగా వుచ్చరిస్తూ) "యాః ఫలినీ ర్యా అఫలా అపుష్పా యా శ్చ పుష్పిణీః బృహస్పతిః ప్రసూతా స్తా నో ముంచ త్వగ్ంహసః"

శ్లో॥ ఫలం మనోరథఫలం పుత్రపౌత్రప్రవర్ధనం।

యస్మా త్తస్మా చ్ఛివం మే స్యా దత శ్శాంతిం

ప్రయచ్ఛ మే॥

ఫలదానకల్పోక్తసంపూర్ణసకలఫలావాప్తిరస్తు. మా అమ్మా! సెల విప్పించండి.

రత్నాంగి—చిత్తం బాబయ్యా!

రుద్రంభట్టు—(విజయాదిత్యుడి కేసి తిరిగి నమ్రుడై) మహాప్రభూ! సెలవు దయచేయించండి.

విజయాదిత్యుడు—(లేచి దోసిలి వొగ్గి నమ్రుడై) నమస్కారాలు.

రుద్రంభట్టు—రాజద్వారే, రాజగృహే సర్వదా దిగ్విజయ మస్తు. వేదోక్తం పరిపూర్ణ మాయుష్య మస్తు. (కొంచెం వూగిస లాడుతూ) చిత్తం చిత్తం.

(రుద్రంభట్టు వెనక్కి వెనక్కి నడుస్తూ వెళ్లిపోతాడు. రత్నాంగీ విజయాదిత్యుడూ యథాప్రకారంగా కూచుంటారు.)

విజయాదిత్యుడు—సరిగా గుర్తించకపోవడం కొంత, భయం కొంత, సహజ మైన ఛాందసం కొంత—మొత్తానికి రుద్రంభట్టుగారు జరిగింది జరిగినట్టు చెప్పలేకపోయారు.

రత్నాంగి—ఏది యే మయినా కావలసిన సంగతి తేలిపోయింది. సిగ్గువల్ల, ఆమె, ఛూసీ చూడనట్టు చూస్తూ వేసినా, యిష్టం లేక, విధి లేక, విసిరికొట్టినా ఫలం వొకటే. పూలదండ తెగిపోవడం మంచిది కాదు. అది యెంతమాత్రమూ శుభసూచన కాదు.

విజయాదిత్యుడు—అదీ సంగతి. అయితే, ఆదిలోనే యీవ్యవహారం అశుభంగా ప్రారంభం అయినది. దాని పర్యవసానం యెలా వుంటుందీ? ఇంతటితో అయినా యీ అశుభం శాంతిస్తే అదొక దారే.

గౌరి—అమ్మా!

రత్నాంగి—(గ్రీవాభంగాభిరామంగా చూస్తూ) ఆ!

గౌరి—జక్కులదీవి పరిచారికలు వచ్చి దర్శనం కోరుతున్నా రమ్మా!

(రత్నాంగీ, విజయాదిత్యుడూ వొకర్నొకరు గంభీరంగా చూసుకుంటారు)

రత్నాంగి—తీసుకురా.

గౌరి—చిత్తం అమ్మా!

(రుక్కునీ, మరొకదాసినీ వెంటపెట్టుకు వచ్చి గౌరి రత్నాంగికి యెదట "యిక్కడ నిలిచి మాట్లాడండి" అన్నట్టు స్థలనిర్దేశం చేస్తుంది. వాళ్లిద్దరూ నూతనవస్త్రాలూ, పసుపుకుంకుమలూ, ఫలాలూ వున్న పళ్లేలప రత్నాంగి యెదట వుంచి, ముందు రత్నాంగి కేసీ, తరువాత విజయాదిత్యుడి కేసీ తిరిగి, వంగి, చేతులతో నేల అంటి కళ్ల కద్దుకుని, చేతులు కట్టుకుని నుంచుంటారు)

రుక్కు—మహారాణీ! మాతల్లి చిత్రాంగీ దేవమ్మ వారు క్షేమంగా చేరినట్టు విన్నపాలు చేసుకుంటున్నారు. మరిన్నీ, భోజనానంతరం దర్శనం చేసుకుంటున్నా మని మనవిచేసుకుంటున్నారు.

రత్నాంగి—(ఒక్కమాటు పళ్లేలు తాకి) చాలా సంతోషం. కనిపెట్టుకుని వుంటా మని విన్నవించు.

రుక్కు—చిత్తం అమ్మా!

(వాళ్లిద్దరూ మళ్లీ యథాపూర్వంగా రత్నాంగికీ, విజయాదిత్యుడికీ నమస్కరించి గౌరితో వెళ్లిపోతారు)

రత్నాంగి—గౌరీ!

గౌరి—చిత్తం అమ్మా!

(గౌరి ఒక్కమాటు రత్నాంగి కేసి చూసి ఆయిద్దరికీ ఫలాలూ తాంబూలాలూ యిస్తుంది. అటూ యిటూ పరిశీలనగా చూస్తూ వాళ్లిద్దరూ మెల్లిగా వెళ్లిపోతారు)

రత్నాంగి—(విజయాదిత్యుడితో) ఏమి కావలసిన పిల్ల యేమయిందో, యెలా తెచ్చుకోవలసిన వస్తువు యెలా వచ్చిందో చిత్తగించారా? ఇలా అవుతుం దని యెవ రయినా అనుకున్నారా? పరమేశ్వరు డయినా యిది యిలా జరగా లని నిర్ణయించి వుంటా డంటారా మరిదిగారూ?

విజయాదిత్యుడు—గతం మరచిపొండి. ఇక భవిష్యత్తు ఆలోచించండి వదినా!

రత్నాంగి—ఇక వొకటే భవిష్యత్తు. చూస్తూ చూస్తూ వుండగా ఆకాశం అంతా కారుమబ్బులు కమ్మేశాయి. ఉరుములతోటీ, మెరుపులతోటీ కుంభవృష్టే కురుస్తుందో మరేమవుతుందో తోచకుండావుంది. మనస్సు మనస్సులో వుండడంలేదు.

విజయాదిత్యుడు—చాలా జాగ్రత్తగా మాత్రం వుండాలి.

గౌరి—అమ్మా!

రత్నాంగి—(కొంచెం వెనకవాటుగా చూస్తూ) ఏం?

గౌరి—(ముందుకి వచ్చి) తమకి ఆకలి లేదుట, కనక తమర్ని భోజనం చెయ్యవలసిం దని వర్తమానించారు అబ్బాయి.

రత్నాంగి—(విజయాదిత్యుడితో) విన్నారా?

విజయాదిత్యుడు—అదేమిటి? అబ్బాయి యిప్పు డెక్కడ వున్నాడూ?

గౌరి—కింద, వుత్తరపు వసారాలో వున్నారుట బాబయ్యా!

విజయాదిత్యుడు—ఎవ రెవ రున్నారూ?

గౌరి—ఎవరూ లేరు. ఒక్కరే వున్నారు. సుబుద్ధి అయ్యవారు యిప్పుడిప్పుడే వెళ్లిపోయారు ట బాబయ్యా!

విజయాదిత్యుడు—(రత్నాంగి కేసి చూస్తాడు)

రత్నాంగి—బుల్లిబాబయ్య పిలుస్తున్నా రని చెప్పి పంపు.

గౌరి—చిత్తం అమ్మా!

(గౌరి గుమ్మంలోకి వెళ్లి, యీసంగతి చెప్పి అక్కడ వున్న దాసీని పంపేస్తుంది)

రత్నాంగి—నాయనకి యిక నిద్రాహారా లుండ వన్నమాట.

విజయాదిత్యుడు—(నిట్టూర్పు విడుస్తూ మొగం వంచుకుంటాడు)

రత్నాంగి—ఆంజంజాటంలో పడి అయినా యిదంతా మరిచిపోతా డేమో అనుకుంటే పెళ్లి అనే మాట కూడా వినిపించుకోవడం లేదు నాయన!

గౌరి—బుల్లిబాబయ్య యిక్కడున్నారు బాబూ!

రత్నాంగి—(వెనక్కి తిరిగి) నాయనా!

సారంగధరుడు—వచ్చా నమ్మా! (ఇలా అంటూ వచ్చి, చేతులు కట్టుకుని విజయాదిత్యుడి దగ్గిర నుంచుని) ఏమి సెలవు బుల్లిబాబయ్యా?

విజయాదిత్యుడు—(దగ్గిర కూచో మని స్థలం చూపిస్తూ) భోజనం మానుకోవడం యెందుకోయ్? దాని వల్ల యేమిటీ ప్రయోజనమూ?

సారంగధరుడు—(విజయాదిత్యుడు చూపించినచోట మండెమీద కూచుని) మధ్యాహ్నపుభోజనం గురువుగా వుండడంవల్ల వుపాత్తం చేసిం దండీ!

విజయాదిత్యుడు—అదేమి మాటోయ్?

రత్నాంగి—నాయన, మధ్యాహ్నం కంచం దగ్గిర

కూచున్నాడు, లేచాడు. అంతే. నాలుగు మెతుకు లయినా పుచ్చుకోలేదు. సయించనే లేదు.

విజయాదిత్యుడు—(సారంగధరుడితో) అవునా? అబ్బే! నువ్వు బంతిని లేకపోతే అమ్మ భోజనం చేస్తారా?

సారంగధరుడు—(తల్లి కేసి ఆదుర్దాగా చూస్తాడు)

రత్నాంగి—పోనీ, బుల్లిబాబయ్యని యీపూట కిక్కడ వుండమన మంటావా?

సారంగధరుడు—ఉండమనండి అమ్మా! (విజయాదిత్యుడితో) ఉండండి బుల్లిబాబయ్యా?

విజయాదిత్యుడు—(రత్నాంగి కేసి చూస్తాడు)

రత్నాంగి—దయచెయ్యండి, తప్పదు. లేకపోతే, నాయన భోజనశాలకే రాడు.

విజయాదిత్యుడు—(ఒక్కమాటు రత్నాంగి కేసీ, వొక్కమాటు సారంగధరుడి కేసీ చూసి) సరే మరీ!

రత్నాంగి—గౌరీ!

గౌరి—అమ్మా!

రత్నాంగి—ఈపూట భోజనా లిక్కడే అని చెప్పి, చెల్లెమ్మగారినీ, పిల్లల్ని తీసుకురా.

సారంగధరుడు—(ఉత్సాహం కనపరుస్తాడు)

గౌరి—చిత్తం అమ్మా!

విజయాదిత్యుడు—వా రెందుకు వదినా?

సారంగధరుడు—రానివ్వండి బుల్లిబాబయ్యా! ఏక బంతి అయి రెండు వారాలు కావస్తోం దండీ, (రత్నాంగితో) నేను వెళ్లి పిలుచుకు వస్తా నండీ అమ్మా.

రత్నాంగి—అంతకంటే కావలసిం దేమిటి తండ్రీ?

విజయాదిత్యుడు—అందరమూ కలిసి వస్తాం వదినా!

రత్నాంగి—అలాగే చెయ్యండి. (గౌరితో) సంగతి రామసోదెమ్మగారితో చెప్పి నువ్వు కూడా వెళ్లు. చూడూ, చంద్రశేఖరం బాబుని నడిపించావు సుమా!

గౌరి—(చిరునవ్వుతో) నడవ మంటే మాత్రం నడుస్తారా బాబయ్యా?

విజయాదిత్యుడు—గుర్రం కావా లనకుండా వస్తే నడిచినంత ఫలం.

సారంగధరుడు—ఆగుర్ర మయినా అదీ యిదీ పనికి వస్తుందా? చింతవువ్వన్న గుర్రమే కావాలి.

రత్నాంగి—బాగా చెప్పావు. చిట్టితండ్రిని నిన్న పొద్దుట అనగా చూశాను. అప్పుడే కళ్లు కాయలు కాసిపోయాయి. నిద్రపోతున్నాడో యేమిటో పాపం!

విజయాదిత్యుడు—అప్పుడే నిద్రా? చిన్నమ్మకీ అతనికీ యిది దశావతారీ ఆట సమయం. మడతపేచీలు పెట్టి ఆమెని కెకూ్క కెకూ్క మనిపిస్తూ వుంటా డిప్పుడు. ఒకొ్కక్కప్పుడు తల్లి కూడా విసిగిపోతూ వుటుం దతని తోటి.

రత్నాంగి—నిజంగా అలాంటి పిల్లల్ని సద్దగలిగితేనే యిల్లాలి చాతుర్యం. చెల్లెమ్మ అదృష్టం చాలాగొప్పది.

విజయాదిత్యుడు—ఆమెఅదృష్టం కంటే తమ ఆశీర్వచనం గొప్పది వదినా!

రత్నాంగి—మీ అన్నదమ్ముల గడసరితనమో?

విజయాదిత్యుడు—(చిరునవ్వుతో) చిత్తం చిత్తం. ఇప్పుడే వస్తాము.

(అందరూ లేస్తారు)

ఆంధ్రులు-కాంగ్రెస్సు

(శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారి)

ఎంత లేదన్నా సుమారు ౨౦ సంవత్సరాలనుంచి, ఆంధ్రులు కాంగ్రెస్ గహనంలో బడి వెనుకచూపు లేకుండా, విచక్షణలేకుండా, కంటకాలను లెక్కించకుండా, దీర్ఘప్రయాణం సాగించారు. లెక్కచెయ్యలేదు గాని, అప్పటినుంచీ అడపాతడపా ఎదురుదెబ్బలు తగులుతూనే వచ్చాయి. పెద్దవో చిన్నవో ముల్లు గుచ్చుకుంటూనే వచ్చాయి. కాని పౌరుషం గల ఆంధ్రుడు వాటిని లెక్కచెయ్యలేదు. కష్టాలు ఎక్కువయినకొద్దీ, ఓర్పుతో నడక సాగించాడు. కాని చివరకు ఎంత దూరం వెళ్ళినా, మృగతృష్ణలు, కంటకలతలు, మాత్రమే గాని, కనీసం చెలమగాని, నిలివెడు చెట్టుగాని ఆశ్రయం దొరకలేదు. ఇకనైనా బుద్ధితెచ్చుకొని, వెనక్కు తిరుగుతాడా? ఇంకా ఇదే ఓపికతో నడక సాగిస్తాడా?

కాంగ్రెస్ కోసం ఆంధ్రులు సర్వసంగపరిత్యాగం చేశారు. ఇంచుమించుగా ఫలోన్ముఖమైన ఆంధ్రరాష్ట్రాందోళనమును వదిలిపెట్టారు; హిందీవ్యామోహంలో బడి కన్నతల్లిభాష నన్న ఏవగించారు. మనదేశపు వాతావరణానికి ఎంతవరకు అనుకూలిస్తుందీ అన్న ఆలోచన లేకుండానే హిందూస్థానీవేషం ధరించి తెలుగు వేషానికి తిలోదకాలిచ్చారు. ఈ దేశపు ఎండలకు గాంధీటోపీ సరిపోతుందా?, తెలుగుదే కావలెనా? బనియను, చొక్కా, పైన జుబ్బా ఇన్ని వేసుకొని భరించగలమా? అనే ఆలోచన ఆంధ్రులు చెయ్యనేలేదు. ఆంధ్రంలో చాలినంత వాఙ్మయం ఉందా, లేదా? ఆంధ్రుల్లో ప్రతిభావంతులు ఉన్నారా లేరా అని ఆలోచించనేలేదు. మొన్నటివరకు సర్. రాధాకృష్ణుడు ఆంధ్రుడని ఎవ్వరికీ తెలియదు. ఇవ్వాళ గవర్నరయ్యేటంతవరకూ ఈడుప్పగంటి రాఘవేంద్రరావు ఆంధ్రుడని ఎవరికి తెలుసు? ఇన్నిమాటలెందుకు? ఆంధ్రదేశములో నాలుగు మూలలా కడుపునకు చాలిన తిండి, కట్టుకోడానికి చాలిన బట్టా దొరుకుతున్నదో, లేదో ఎవ్వరూ ఆలోచించలేదు.

మన ఆంధ్రులు ఈగోడవల్లో పడి కొట్టుకుపోతుండగానే, అటు అరవవాళ్ళు, ఇటు ఓఢ్రులూ, తమ పని తాము చల్లగా చక్కబెట్టుకోసాగించారు. ఆంధ్రదేశంలో మారుమూలలలో గూడ ఉన్న, ఉన్నతోద్యోగాలన్నీ అరవవాళ్ళు ఆక్రమించుకున్నారు. అరవదేశంలో కావలసిన ప్రాజెక్టులన్నీ తయారుచేయించుకున్నారు. యూనివర్శిటీలు స్థాపించుకున్నారు. వాఙ్మయాభివృద్ధి చేసుకున్నారు. ఇలాఉండే తమిళులు కాంగ్రెస్‌లో గూడా మంచి పలుకుబడి సంపాదించారు. కాంగ్రెస్‌కు అధ్యక్షులయినారుగూడాను. ఇక ఓఢ్రులు గూడ తమ జనసంఖ్యకు తగినంతకన్నా ఎక్కువ తీవ్రంగానే ఉద్యమం నడుపుకున్నారు. సర్కారువారి చల్లని దృష్టిలో చల్లగా ప్రత్యేకరాష్ట్రం ఏర్పరచుకోగలిగారు.

మనవాళ్ళకు "ఇంటికి" సంగతు లెట్లా ఉన్నా, రచ్చలో నన్నా పలుకుబడీ, కీర్తీ, అధికారం, అభివృద్ధి, ఏమైనా కలిగాయా, అంటే మరీ పూజ్యమే! మొన్నటివరకూ కాంగ్రెస్‌లో కార్యనిర్వాహకసభ్యత్వం కూడా లేకుండా చేయబడ్డారు. చివరకు అనుసరించుకుని తిరగ్గా, తిరగ్గా, క్రిందటిసారి పట్టాభిగారిని ఉండనిచ్చారు. సరే నిరుడు అధ్యక్షత వచ్చేస్తున్నది ఆయనగారికి, అన్నారు. అన్యరాష్ట్రాల్లో ఉన్న మాలాటివాళ్ళం గూడ ఆనందించాం మా ఆంధ్రుడు ఈసారన్నా కాంగ్రెస్ గద్దె ఎక్కుతాడు గదా అని. కాని ఏంలాభం? కన్నమ్మకే వాపి, పిన్నమ్మకే తీపి. అన్నట్లు మళ్ళీ ఇదివరకొకసారి ఎక్కిన నెహ్రూనే ఎక్కించారు. చివరకి ఆంధ్రులకి ఓదార్పు వచనాలన్నా ముట్టలేదు. సరే చివరకి మా వాళ్ళిద్దరు ముగ్గురికి కార్యనిర్వాహకసంఘంలో, స్థానాలిచ్చి సానుభూతి ఐనా చూపిస్తారని ఆశపెట్టుకొని కూర్చున్నాం. చివరకు దానికి గూడా మొండిచెయ్యే చూపించారు. పోనీ ఈసంవత్సరమన్నా అధ్యక్షుడయ్యే ఆశామేఘాలేమయినా చూపుమేరలో ఉన్నాయేమో ననుకుంటే దానికి గూడ ఆంధ్రుడికి స్థానం లేకుండా ఆపదవి సుభాస్ చంద్రబోసుగారికిచ్చారు.

ఇటీవల రాజేంద్రప్రసాదు ఆంధ్రదేశప్రచారానికి వచ్చి ప్రతిచిన్నగ్రామానికి కూడా వెళ్ళి, అఖండసన్మానాలు జరిగించుకొని వేలకు వేలు సమ్మర్పించుకుపోయారు. అదేదో ఒక ఊళ్లో, ఆర్థికంగా ఆవగింజంత గూడ అధికారం లేని ఆడవాళ్ల సంఘం గూడా ముడుపు చెల్లించుకున్నదిట. ఇంతకూ ఆయన ప్రచారం వల్ల ఆంధ్రదేశానికి వచ్చిన గౌరవంగాని ఉపకారంగాని చీమతలకాయంతయినా లేదు. పైగా ఈకాంగ్రెస్‌తో ఉన్న గౌరవం గూడా ఊడింది.

ఇంతేకాక మన ఆంధ్రుల్లో చాలామంది వ్యక్తులు, సంస్థలు గూడ ఔత్తరాహులంటే దేవతలుగానూ, అవతారపురుషులుగాను ఎంచి వారిని మాటలతోను మాటలతోను గౌరవించి వారి ఆజ్ఞల్ని శిరసావహించి, వారి వేషం ధరించి, వారి భాషను నేర్చుకొని, వారి దేవుళ్లని వారి ఆచారాల్ని దిగుమతిచేసుకొని ఏవిధంగా నైనా తరించవలె ననుకోటం సర్వసామాన్యం అయిపోయింది. ఆంధ్రదేశంలో సభలకు గాని ఏదైనా ప్రజోపయోగసంస్థలకు గాని అధ్యక్షులుగానో, ప్రారంభకులుగానో, శక్తికి మించిన వ్యయం భరించి అయినా, ఉత్తరాదినాయకులను ఊడిపడునట్లు చేయగలిగిననే ముక్తి నొందునట్లు తలంచెదరు. లేకపోతే తృప్తి లేదు. ఉదాహరణకోసం బెజవాడ దగ్గిర ఖద్దరుసంస్థానంవారు ప్రచురించిన రిపోర్టు ఒకటి చూపిస్తాను. వాళ్లు ఆమధ్య తొమ్మిదిరోజులు అఖండచరఖాయజ్ఞం చేశారట. అనేకమంది స్త్రీపురుషులు ఆతొమ్మిది రోజులూ రాత్రింబగళ్లు నూలువడికారుట. శ్లాఘనీయమైన విషయమే! ఆనూలుతో బట్టలు నేయించి గాంధీగారికి పంపించినారుట. చివరకు కళ్లనీళ్లు వస్తున్నాయి. అదే గుడ్డ ఆంధ్రదేశంలో అల్లాడుతూ ఉన్న అనాథలకు ఎవరికన్నా పంచిపెట్టితే ఆనందంతో కట్టుకునే వారుగా!! ఆయనగారా గుడ్డను దిండుగలీబులు చేసుకున్నారుట. అందువల్ల ఆసంస్థానికి గాని ఆంధ్రదేశానికి గాని వచ్చిన లాభం ఏమీ లేదు. ఇంతేగాక అందులోనే ఒక మహాశయుడు తన భార్యా జ్ఞాపకార్థం స్వంతఖర్చులతో ఒక భవనం నిర్మించి దానికి రాజేంద్రభవనం అని పేరు పెట్టుకొన్నాడుట. ఎందుకో? ఆభార్యాపేరే పెట్టితే ఆమె ఆత్మకు శాంతి కూర్చి, ఆంధ్రత్వం నిలవబెట్టవచ్చునుగదా! రాజేంద్రుడి పేరు బెట్టడంవల్ల వీరికి అతనివల్ల రాళ్లకు మన్నుకు అయ్యే ఖర్చయినా రావడము లేదుగదా!!!

ఇలాటి ఉదాహరణలు చూపించవలె నంటే వేలూ లక్షలూ ఉన్నాయి. తలుచుకుంటే అన్యరాష్ట్రాల్లో పడి వున్న ఆడదాన్ని నాకే కడుపు తరుక్కుపోతున్నది. ఇంతటితో నయినా, ఆంధ్రుడు, ఔత్తరాహులతోనూ, కాంగ్రెస్‌తోనూ, హిందీతోనూ, సంబంధం పూర్తిగా వదులుకొని తన స్వంత సమస్యలు పరిష్కరించుకోడానికి ప్రయత్నిస్తాడా?? ఇంకా సర్వనాశనమే కాంక్షిస్తాడా?

వ్యాఖ్యానములు

నిజమైన ఆవేదనే: కాని దారి తప్పింది

"తెలుగుల మేలుకోల్పె, నుపదేశ మొనర్చెను రాష్ట్రమంత్రి, యాంధ్రుల విభవమ్ము గోరి పలుదుఃఖములన్ వరియించె, నమ్మహోన్నత చరితుండు "కొండ" కులసాగర చంద్రుని ప్రాణవాయువే వెడలక మున్నె మా తెలుగువీరులు తెత్తురు గాక రాష్ట్రమున్"

ఉభయభాషాప్రవీణులు, తుమ్మల సీతారామమూర్తి-చౌదరిగారు తమ కొత్త గ్రంథం "రాష్ట్రగానం" లో మన తెనుగువీరులను యిలా వుద్బోధిస్తున్నారు.

రాష్ట్రగానం ప్రతీ పేజీలోనూ, యిప్పటికీ ఆంధ్రరాష్ట్రం యేర్పటనందుకు, చౌదరిగారికి కలుగుతున్న పరితాపం స్పష్టంగా కనపడుతున్నది. అయితే: అది ఆంధ్రోద్యమచరిత్ర తెలిసి కలుగుతున్న పరితాపంగా మాత్రం కనపడ్డంలేదు. "యిరువది దారు శరత్తులనాడె రాష్ట్రమున్ దెచ్చెద మన్న తెల్గులకు దీరవ కోర్కులు" ఇదీ దాని వరస.

తెనుగువారి కోరికలు తీరలేదు. నిజమే. ఎందుకు తీరలేదూ? ఎలాంటి దోహదమూ లేకుండా మొలిచిన మొక్క మొలిచినట్టే యెదుక్కుపోతుందా? పూసేసి న్నీ కాసేస్తుందా?

వ్యక్త్యపేక్షయా, చౌదరిగారికి, కొండా వెంకటప్పయ్యపంతులుగారంటే చాలా గౌరవం వున్నట్టున్నది. మా భాగే. అయితే, పంతులుగారు బతికే వుండగా ఆంధ్రులు రాష్ట్రం తేవాలనడంలో వున్న ఆంతర్యం యేమిటీ?

పంతులుగారు రాష్ట్రం తేవలసిన ఆంధ్రులకంటే భిన్నులా? లేక, అతీతులా?

పంతులుగారు కూడా ఆప్రయత్నంలో యెందుకు చెయ్యిచేసుకోరూ? వృద్ధులయి వుండిన్నీ, వారు, దక్షిణభారతదేశంమీద తమ అధికారం చెలాయించాలని ఉవ్విళ్లూరుతూ వున్న గుజరాతీల—హిందూస్థానీల తాఖీదులమలపరచడంలో తరుణులకంటే యెక్కువ వ్యగ్రోత్సాహం కనపరుస్తున్నారే? అది—లేక—అలాంటిది ఆంధ్రరాష్ట్రం విషయంలో కూడా నా రెందుకు చూపించరూ?

పంతులుగారే అందరికంటే ముందు రాష్ట్రప్రస్తావన చేసిన వారంటే మా కాక్షేపణ లేదు; కాని ఆరాష్ట్రప్రస్తావన విడిచిపెట్టేసినవారిలో కూడా పంతులుగారే మొదటివారని చౌదరిగారు ఎరుగుదురా?

మరిన్నీ, చౌదరిగారు "ఆంధ్రుల విభవమ్ము గోరి పలుదుఃఖములన్ వరియించె" నని పంతులుగారిని చాలా భూషిస్తున్నారు. ఇందులో ఔచిత్యం యేమీ కనపడదు. ఏమంటే? వారు లాఠీచార్జీలకు పాల్పడి వుండవచ్చు. జెయిళ్లకు వెళ్లివుండవచ్చు. సర్కారు శిస్తు చెల్లించ నని నిరాకరించి వుండవచ్చు; కాని యివి యేవీ ఆంధ్రుల కోసం గాని ఆంధ్రరాష్ట్రం కోసం గాని వారు అనుభవించలేదు. ఈదుఃఖాలు అనుభవించిన రోజుల్లో, వారు, ఆంధ్రోద్యమం పూర్తిగా విడిచిపెట్టేసి వుండినారు. ఆంధ్రరాష్ట్రంఅంటే క్షుద్రవాంఛ అనిన్నీ వారు దృఢంగా నిర్ధారణ చేసుకుని వుండినారు.

ఇలాగ పంతులుగారిని గౌరవించబోయారే గాని, చౌదరిగారు, సంకల్పసిద్ధులు కాలేకపోయారు.

పై పెచ్చు,—

"తత్వ మెఱుంగ లేక బహుధా శ్రమలన్ గుడువంగ నేల? యాంధ్రత్వము లేని నాడు కలదా మన కించుక యేని భారతీయత్వము? తెల్గువీరు డొక డైనను కాంగ్రెసు గద్దె నెక్క నేతృత్వము మాపు భాగ్యమున కేటికి నోచకపోయె జెప్పుడీ"

"కల ధన మెల్ల నొడ్డినను, కాంగ్రెసుకై పడరాని బాధలన్ వలచిన, బందె కోర్చిన, లవంబును జంకక నెత్తు రొడ్డినన్ దెలుగుల త్యాగ మెల్ల విశదీకృత మైనది, యింటిలోపలన్ గెలువని నాడు నచ్చులను గెల్చుట యెట్లు పొసంగు జెప్పుడీ?"

ఆంధ్రసామాన్యంకోసం వుద్దేశించబడ్డ యీపద్యాలు విపరీతార్థ ములుకుకొనై పంతులుగారికే నాటుకుంటున్నవి. చౌదరిగారది గమనించలేదు.

మరిన్నీ వారు,

"అచ్చెరు వయ్యెబో యిరువదారు శరత్తులనాడె రాష్ట్రమున్ దెచ్చెద మన్న తెల్గులకు దీరవ కోర్కులు; మొన్న మొన్న క...

వచ్చిన యోధ్ధ సైంధవుల వేష్కులు పూచి గొంతుచేసి నెన్నుకో వచ్చిన పీనులకి నిగుడు వచ్చిన కొమ్ములు వెక్కిరించేడిక్ " అంటున్నారు.

ఏం ? ఇది యిలా యెందుకు జరిగింది ?

నిజంగా, బ్రిటిషువారికి ఎలాంటి యిబ్బందీ కలిగించని—వారు అంగీకరించే వున్న ఒక రాష్ట్రం నిర్మించడానికి యిరవై ఆరు సంవత్సరాల పరిశ్రమ కావాలా?

కాలచక్రం నిలవదు. జనవరి మొదలు డిసెంబరు ఆఖరుకి పన్నెండు మాసాలు ౧౯౧౨ మొదలు ౧౯౩౮ ఆఖరుకి ౨౬ సంవత్సరాలు. సంవత్సరాలు అతివేగంగా గడిచిపోతాయి. లెక్క కూడా అతిసులువుగానే తేలిపోతుంది; కాని రాష్ట్రనిర్మాణానికి ఆశ వొక్కటే చాలదు. కోరిక వొక్కటే ప్రధానం కాదు. దీక్ష వుండాలి. ఏకాగ్రత కావాలి. తపన వుండాలి. " అయ్యో, కాలం గడిచిపోతోందే " అనే ఆవేదన వుండాలి. "ఛీ! ఇది సాధించలేకపోతే మన బ్రతుకెందుకూ ? " అని పౌరుషం వుండాలి.

ఇందులో యేది లేకపోయినా లాభం లేదు.

ఇంతెందుకూ ? కొండా వెంకటప్పయ్యగారు రాజకీయాలలో ప్రవేశించి యెన్నాళ్లయింది? "పట్టాభిసచివు" లున్నూ రాజకీయాలలోకి దిగి యెన్ని సంవత్సరాలయింది ? అటు రాజగోపాలాచారిసత్యమూర్తిగార్లున్నూ రాజకీయాలలో వేలుపెట్టి యెన్నాళ్లయింది ? ఇవాళ చూస్తే కాంగ్రెస్సులో వారి పోజిషనేమిటి, వీరి పోజిషనేమిటి ?

సర్వమూ సిద్ధ మయిపోయిన తరవాత—అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను కడసారపు నిర్ణయం కూడా చేసేసిన తరవాత—గాంధీజీ నెహ్రూగార్లు రాజగోపాలాచారిగారిని తీసుకువచ్చి అమాంతంగా నెత్తికెక్కించడం వల్లనయినా కాంగ్రెస్సులో మన " కొండకులసాగర చంద్రుని " హోదా యెంతమాత్రమో చౌదరిగారు గుర్తించలేకుండా వున్నారా ?

అసెంబ్లీ అభ్యర్థిగా వుండమంటే పాడుసిద్ధాంతం పట్టుకుని వేళ్లాడుతూ మన పట్టాభిగారు " ససేమిరా " అన్నారు. రాజగోపాలాచారిగారు " దొరికిందిరా సందు " అని గభీమని ప్రవేశించారు. దీనివల్ల మన స్థితి యెంత అధ్వాన్న మయిపోయిందో చౌదరిగారు గుర్తించారా ? మన " సచివుల " రాజనీతి పరిజ్ఞానం యేపాటిదో వారు తెలుసుకున్నారా ?

జాతి నుద్బోధించవలసిన బాధ్యత నేటి ఆంధ్రకవికుమారులమీద యెంత యెక్కువగా వున్నదో యెరుగుదుము. చౌదరిగారి రాష్ట్రగానం మంచి సమయంలో ప్రారంభమైనందుకు మేము ప్రశంసిస్తూనే వున్నాము; కాని, మన మహామహానాయకులు మన ఆంధ్రజాతిని ఆభాసు చేయబూనుకున్న ఆంధ్రేతర్ల యెదట పిల్లులై వున్న సందర్భంలో—ఆత్మప్రత్యయం లేకుండా వున్న సమయంలో " మమ " అనే భావమే కాక శబ్దం కూడా మరచిపోయి వున్న స్థితిలో అనవసరంగా వారిని ఆకాశానికెత్తివేస్తూ " మీ నిష్కృత్యంబున కడ్డు లేదు, చరితార్థత్వంబు మీకబ్బు, నేపట్లన్ మీరూనిన నేమి లెక్క ? " " తెల్గుబిడ్డ నేలింపను బ్రహ్మసముద్రాములే చేయింపఁ జాలునని తక్కువ ముఖ్యులకై చింతింపగా నేటికిక్ ? " " మీ నామ్మకి మూర్తి మంత్రమును, మీకష్టము వచ్చి నిల్వదిక నెట్టి మగన్న వాకు లేదు " " మీరా తెలుగుజోదులు దీనికి నోపలేరల్లనేలా ? యెట్లో పెక్కువి జగము సంకెళ్ళ దార్చుగదా క్షణంబునకు " అని వందిమాగధస్తోత్రాలు నెరవేర్చడం యేమీ బాగా లేదు.

మామిత్రులు సీతారామమూర్తిచౌదరిగారికి మంచి కవితాధార వున్నది. ఆవేశం వున్నది. వారి పుట్టుకలోనే కాక కవిత్వంలో కూడా కమ్మదనం వున్నది; కాని వారి దృష్టి నిశితంగా లేదు. ఆవేదన తప్పుదారిలో పడిపోయింది.

సాంబమూర్తిగారిని లేచి రమ్మనండి

కాంగ్రెస్సు, ఆంధ్రజాతిపాలిటి శోకచుక్క. కాళరాత్రి. ఏల్నాటిశని. ఇనపగజ్జెలతల్లి.

ఈసంగతి కాంగ్రెస్సు నియంతల పరిముఖంగానే వెల్లడి కావడం చాలా బాగుంది. మన మహర్షి బులుసు సాంబమూర్తిగారి పేరు మీదుగానే విస్పష్టం కావడం

మరీ బాగుంది. డాక్టరు పట్టాభి సీతారామయ్యపంతులుగారి ఆంధ్ర రాష్ట్రీయసంఘాధ్యక్షత నవనవలాడిపోతూ వున్న సమయంలోనే యిది సహాంగం అయిపోవడం మరీమరీ బాగుంది.

అయితే; ఇది, కాంగ్రెస్సుని గాంధిగారాక్రమించుకున్న వెంటనే నిర్ధారణ అయిపోయిన సంగతే; కాని హిందీమానసపుత్రులు కావడంవల్ల కాంగ్రెస్సాంధ్రులు, అగ్రజ్ఞానం కోల్పోయి యిది తెలుసుకోలేకపోయారు.

జాతి మొత్తంమీద పతనం యింకా పూర్తి కాలేదు; కనక, యిది యెవరికి తెలిసివుండడం చాలా అగత్యమో ఆ ఆంధ్రయువకులకున్నూ బోధపడలేదు.

అంచేతనే ఆంధ్రోద్యమలత కొనలుసాగి, పూసి, కాని, ముద్దులు మూటకడుతూ వుండవలసిన ఆంధ్రభూమిలో కాంగ్రెస్సు ముళ్లడొంక అలుముకుపోయింది.

ఇంతట్లో ఆంధ్రరాష్ట్రం యేర్పడుతుం దని మే మెప్పుడూ అనుకోవడం లేదు. ఏమంటే? జాతికి అది యెంత అగత్యమో అంత వాంఛ, అంత ఆవేదన, అంత దీక్ష, అంత ఏకాగ్రత లేదు. అది కావలసినవారెవరో, దాన్ని నిర్మించే అధికారం యెవరి కున్నదో, కార్యక్రమం యేమిటో, సమకూర్చుకోవలసిన సాధనసామగ్రి యేమిటో, విఘాతం కలిగిస్తూ వున్న ప్రతికూలశక్తు లేవో, గోతులు తవ్వుతున్న మిత్రు లెవరో యేమీ తెలవదు.

నిజంగా, ఆంధ్రరాష్ట్రమే కావలసి వుంటే, ఆంధ్రులు, గుజరాతీ మిల్లుపట్టులు కట్టరు. ఎప్పుడో చచ్చిపోయి వుండిన రాట్నంమీద నూలు ముట్టరు.

దేశంలో యెక్కడ యేమి జరుగుతున్నదో, తమ స్థితి యెంత తయారవుతున్నదో తెలుసుకోకుండా గొర్రెలలాగ బుర్ర వంచుకు నడుస్తూపోరు.

కాంగ్రెస్సు సంపాదించడమే వస్తే ఆస్వరాజ్యం మనకు స్వరాజ్యం కాదు. అది బ్రిటిషు రాజ్యం కంటే అపాయకర మైన పరరాజ్యం.

రాజ్యం అన్నది యెప్పుడూ నోరున్నవాళ్లదే అని పసిపిల్లలకున్నూ బాగా తెలుసు. నిజానికి మనకూ, నోరున్నది. ఏమీ సందేహం లేదు; కాని ఆ మన నోట గాలి లేదు. అంచేతనే మనజాతి జీవచ్ఛవమై వున్నది.

ఎప్పటి కయినా ఆంధ్రరాష్ట్రమే మనకి స్వరాజ్యం. స్వరాజ్యం అన్నది యేర్పడడమే తటస్థపడితే అది మన వొక్కళ్లదే కాదు. మరన్నీ మన వొక్కళ్ల వల్లనే రాదు. ఆంధ్రరాష్ట్రం, అలా కాక, మన వొక్కళ్లకే దఖలుపడుతుంది. మన వొక్కళ్ల వల్లనే సాధ్యపడుతుంది.

అది సంపాదించుకోగలిగిననాడే మన పురుషకారం వెల్లడి అవుతుంది. మన అస్తిత్వం ధ్రువపడుతుంది.

ఇప్పుడు గుజరాతీహిందూస్థానీల స్వరాజ్యంసరంభంలో మనవారు చేస్తున్నది అందోళన కాదు. పనికాదు. పోరాటం కానే కాదు. మరేమిటంటే! అది, పూర్తిగా, "స్వామి విధేయ తాండవం"

* * * * * * * *

మన సాంబమూర్తిగారి లండను ప్రయాణానికి కారణం, అక్కడి అధికారులకు నచ్చచెప్పి ఆంధ్రరాష్ట్రం నిర్మింపించే ప్రయత్నాలు చెయ్యడానికని తెలుస్తున్నది. నిజంగా యిది సత్యమే కావచ్చు; కాని, పైపూతే కాని, యీ సత్యంలో, సత్యానికుండవలసిన స్వచ్ఛతా, సమగ్రతా, యోగ్యతా అణుమాత్రమూ కనపడవు. జపానునుంచి వస్తున్న సెల్యులాయిడుబొమ్మలు నిక్కగానే వుంటవి; కాని, అవి లోపల వొట్టి డొల్లలు. ఈసత్యమున్నూ అలాంటిదే.

ఏమంటే? స్పీకరయిన కొత్త ఉత్సాహంతో, సాంబమూర్తిగారు, ఆంధ్రరాష్ట్రవాంఛ పరమనీచమనీ, క్షుద్రమనీ, పూర్తిగా నిరసించారు.

నాలుగు వేపులనుంచీ యీ కేకలూ, కూతలూ వచ్చి చురకూ చురకూ సుమ్మకోగా, అప్పుడు ప్రక్కలో పడి, అపారమైన సద్యస్ఫూర్తి కలవారు కనక, తమ వుపన్యాసం సరిగా రిపోర్టు చెయ్యలేదని పత్రికావిలేఖకులమీద అక్రమమైన నేరం మోపుతూ "రాష్ట్రీయశాసనసభలలోనే కాక ఫెడరల్ శాసనసభలో కూడా అంగీకరింపబడితే గాని కొత్త రాష్ట్రం నిర్మించడానికి కొత్త యిండియా శాసనంలో అవకాశం లేదు కనకనూ, కాంగ్రెస్సువారు ఫెడరేషను ఏర్పడనివ్వరు కనకనూ, పూర్ణస్వరాజ్యం వస్తే గాని ఆంధ్రరాష్ట్రం యేర్పడడానికి వీలు లే" దని తాము చెప్పినట్టు తిరిగాతి వారు సవరించుకున్నారు.

అయితే, యిప్పుడు ఫెడరల్ శాసనసభ యేర్పడివున్నదా? లేనప్పుడు సాంబమూర్తిగారు లండను వెళ్లి యేమి ప్రయోజనమూ?

నేటివరకూ, వారు అది దిద్దుకోలేదు. సవరించుకోలేదు. ఉపసంహరించుకోనూ లేదు.

పైపెచ్చు పార్లమెంటరీ సంప్రదాయాలు నేర్చుకోడానికే అన్నారు; గాని, వారు, తమ లండనుప్రయాణానికి కారణం "ఆంధ్రరాష్ట్రనిర్మాణవిషయం కూడానూ" అని రహస్యంగా అయినా బహిరంగపరచలేదు.

ఇలాగ పూర్వాపరసందర్భాలు గుర్తించుకోని—సరిపుచ్చుకోలేని మన మహాగురువారు, ఒక పెద్దవ్యవహారంలో లండను అధికారులకు నచ్చచెప్పగలగడం సంభవమేనా!

అసలు, వారికి, నిజంగా ఆంధ్రరాష్ట్రనిర్మాణవాంఛ వున్నదంటే యెలాగా నమ్మయ్యేది?

బడ్జెట్టు సందర్భంలో ఆంధ్రరాష్ట్రప్రస్తావన చేసినందుకు స్వామిగారని గద్దించిన సాంబమూర్తిగారికి—వెంకటప్పయ్యగారిచేత గిసా భాసపు రాష్ట్రవిభజనతీర్మానం ప్రవేశపెట్టిస్తూ వుంటే గాంధిగారి వియ్యంకులను ప్రతిఘటించలేని సాంబమూర్తిగారికి—ఏకోశంలోనో

యేమారుమూలనో ఆంధ్రరాష్ట్రవాంఛ వున్నదంటే "సరే" అని యెలాగా సమ్మతించడం ?

తమకి ఆంధ్రరాష్ట్రవాంఛ వుండడమే నిజమైతే, సాంబమూర్తి గారు, అసంగతి వెల్లడిపరచడానికి భయపడవలసిన — కుండల్లో గుర్రాలు తోలవలసిన అవసరం యేమిటి ?

ఆంధ్రరాష్ట్రం కావాలనడం అంటే దొంగతనం చెయ్యడమా? సేలం జిల్లాలో కల్లంగళ్లు ప్రారంభం చేయించడమా ?

పోనీ, అలా కాదు. "సాంబమూర్తిగారికి ఆంధ్రరాష్ట్రవాంఛ వున్నది. నిజంగానే వున్నది. తీవ్రంగానూ వున్నది. ఎప్పుడెప్పుడని వారి హృదయం వురకలు వేస్తూనే వున్నది" అనుకుందాం. ఒప్పుకుందాం.

అయితే, పార్లమెంటరీసంప్రదాయాలు నేర్చుకోడానికంటే కాంగ్రెసుకార్యసంఘం అనుమతి యివ్వలేదని ఆగ్రహించి స్పీకరు పదవికీ అసెంబ్లీసభ్యత్వానికీ రాజీనామా యివ్వబోయారే సాంబమూర్తిగారు ? ఇప్పుడు వర్కింగు కమిటీ ఆంధ్రరాష్ట్రం సాధించడంకోసం కాంగ్రెస్సుమెంబరులండను వెళ్లడం సుతరామూ పనికిరాదని ఝుమాయించి తిరస్కరించేసింది కదా, వారిక కాంగ్రెస్సు సభ్యత్వానికి రాజీనామా యిచ్చేస్తారా ?

వేలు తెచ్చే ప్లీడరీనే యెడమకాలితో తన్నేసిన సాంబమూర్తి గారు, తమ జాతికి అపకారం చేస్తున్న కాంగ్రెస్సుని కూడా అలాగే సత్కరించి నిజమైన ఆంధ్రుడుగా—జీవంగల ఆంధ్రుడుగా నిలబడతారా ?

* * * * *

ఇక్కడ ముఖ్యంగా వొక్క సంగతి చెప్పవలసి వున్నది.

సాంబమూర్తిగారు సాహసవిక్రమాంకులే కావచ్చు. పట్టాభి సీతారామయ్యగారు మహాప్రతిభావంతులే కావచ్చు. వేంకటప్పయ్య గారు దేశభక్తులే కావచ్చు; కాని వారు ముగ్గురూ కూడా ఆంధ్ర రాష్ట్రం తేలేరు. వారి జీవితచరిత్రలలో "ఆంధ్రరాష్ట్రం సాధించా" రన్న ముక్క చేర్చబడే అదృష్టం వారికి లేదు.

ఏమంటే? మేము నిజం చెబుతున్నాము. ఉన్నది వున్నట్టు చెబుతున్నాము.

మనకి ఆంధ్రరాష్ట్రం కావాలా ? కావలసి వుంటే, మనం, మన దేశపు సరిహద్దులలోనుంచి గాంధిగారి కాంగ్రెస్సుని అవతలకి పడగొట్టెయ్యాలి. బ్రిటిషువారితో సహకారం చెయ్యాలి.

ఈముగ్గురూ యీపని చెయ్యరు. కనక వారు రాష్ట్రం తేలేరు.

యథార్థంలో మనకి రాష్ట్రమూ కావాలి, బ్రిటిషువారు దీన్ని అంగీకరించే వున్నారు; కాని మన వుభయులకూ మధ్య ప్రవేశించి, యీగుజరాతీల కాంగ్రెస్సు, భేదతంత్రం ప్రయోగిస్తున్నది.

అరవల ప్రాతికూల్యం మాకు తెలవంది కాదు; కాని దానివల్ల మనకేమీ నష్టం రాదు. అది మన కేమీ చెయ్యలేదు. సొంతంగా బరిమీదకి వచ్చి, అది, మన కెదురుకోలేదు. కాంగ్రెస్సు ఆసరా చూసుకుని అది భరతవిద్య ప్రదర్శిస్తున్నది.

ఇందులో వున్న రహస్యం యేమిటంటే ?

మనం ఆంధ్రరాష్ట్రం కావాలంటున్నాము. దానివల్ల కష్టం వచ్చినా, నష్టం వచ్చినా అనుభవించడానికి కోరి మనం సిద్ధపడుతున్నప్పుడు, మన అక్కరలను ఆక్షేపించడానికి ఈ అరవ లెవరు ? కాని వారు రహస్యంగా ప్రతిఘటిస్తున్నారు. మనం వుభయులమే అయితే యీ ద్వంద్వయుద్ధంలో సులువుగానే మనం పైచెయ్యి కాగలం; అయితే, అరవలు గుండెబెదురుతో చాటుచాటుగా దెబ్బతీస్తూ వుంటే, ఆదెబ్బలు కాసుకోడానికయినా అవకాశం లేకుండా, గుజరాతీల కాంగ్రెస్సు, బోసినోటి ముసిముసినవ్వులతో కౌగిలించుకున్నట్టు నటిస్తూ మనల్ని అణచిపెడుతున్నది. మన సాంబమూర్తిగారూ, మన పట్టాభిగారూ, మన వెంకటప్పయ్య గారూ యిదేమీ తెలుసుకోలేకుండా వున్నారు.

అసలు అగ్గి అంటూ వుంటే గాలి వచ్చి తోడవుతుంది. నిజమే. అయితే, అగ్గే లేకపోతే ?

అలాగే, మనం కాంగ్రెస్సుని లెక్కచేసినంత కాలమే మనకు అరవల ప్రాతికూల్యం పెనుభూతంలా కనపడుతుంది. కాంగ్రెస్సుకి వుద్వాసన చెప్పేస్తే ?

అరవల ప్రాతికూల్యానికి జడిసా మనం ఆంధ్రరాష్ట్రోద్యమం విడిచిపెట్టింది, కాంగ్రెస్సు మాయాజాలంలో యిరుక్కునా ?

పిడతలో నూనె పడతలోనే వుండాలి, బిడ్డ దీరగింజలా వుండాలంటే అది సాధ్యపడే దేనా? అలాగే మేము కాంగ్రెస్సులోనే వుంటాం అంటే, మేము బ్రిటిషువారి అధికారాన్ని లెక్కచెయ్యం, కాని, వారు మాత్రం మాకు ఆంధ్రరాష్ట్రం యేర్పరచాలంటే యేమయినా అర్థం వున్నదా ?

* * * *

తెలుసుకో గలిగితే, యిప్పుడు మన కెదురుకుంటున్నవి రెండే సమస్యలు. అవేమిటంటే? మన కిప్పుడు ప్రధానం ఆంధ్రోద్యమమా, కాంగ్రెస్సా ? అంటే, ఆంధ్రరాష్ట్రమా, స్వరాజ్యమా ?

ముందు మన మీసంగతి తేల్చుకోవాలి. ఏకకాలంలో యివి రెండూ యెప్పుడూ సాధ్యం కావు.

ఇంతే కాదు. పూనుకుంటే ఆంధ్రరాష్ట్రం యీక్షణంలో వస్తుంది. ఏం చేసినా స్వరాజ్యం యింతట్లో రాదు.

ఇప్పుడు మనం ఆంధ్రోద్యమాన్నే నమ్ముకుంటామా, పూర్తిగా బాగుపడతాము. కాంగ్రెస్సునే నమ్ముకుంటామా, నామరూపాలు లేకుండా పోతాం.

తుంగభద్రప్రాజెక్టు వెనక్కి వెనక్కి వెడుతూ వుంటే గడ్డం పెడుతున్నామే, కృష్ణారిజర్వాయరుస్కీము మూలపడిపోతే మిడుతూ మిడుతూ మాస్తూ వూరుకున్నామే, తొర్రిగడ్డస్కీము తుస్సుమంటే కళ్లు చిరతలు కమ్మి విభ్రాంతుల మయిపోయామే, విశాఖపట్నం మెడికల్ కాలేజీకి రికగ్నిషన్ రాకపోతే కుక్కిన పేల మయి వూరుకున్నామే, యిక మనమా స్వరాజ్యం సాధిస్తాము! మనల్ని కాంగ్రెస్సు మనుష్యులుగా భావిస్తుందా ?

ఏతావతా!

ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెస్సు సంఘం, సాంబమూర్తిగారి నెంత పొగడినా, వారివల్ల, జాతి, నలుగురిలోనూ చాలా లోకువయి పోయింది.

వారు స్పీకర్ల సమావేశం జరిగిస్తా మని కంకణం కట్టుకున్నారు; కాని బాగా ముడిపడక అది జారిపోయింది. అసెంబ్లీహాలులో వంచే మాతరం పాటకచేరీ చేయించబూనుకున్నారు; గాని నిషూయించుకోలేకపోయారు. లండన్ ప్రయాణం కట్టారు: కాని అడుగు ముందుకి వెయ్యలేకపోయారు. అసెంబ్లీసభ్యతకూ, స్పీకరుషిప్పుదాకా రాజీనామా యిచ్చేస్తా మన్నారు; గాని సాగించుకోలేక పోయారు.

దీనివల్ల మద్రాసుగవర్నమెంటులో వారి పలుకుబడి యేపాటిదో స్పష్టపడిపోయింది, మాహమ్మదీయులకు వారంటే యేమీ విశ్వాసం లేదని తేలిపోయింది. వారికి పార్లమెంటరీసంప్రదాయపరిజ్ఞానం చాలదని వెల్లడి అయిపోయింది. కాంగ్రెస్సు వలయంలో వారి మాటకి వూతం లేదని నిరూపడిపోయింది.

ఈస్థితిలో వారు కాంగ్రెస్సుని అంటిపెట్టుకుని వుండడం ఆంధ్ర జాతి సహించలేదు.

గుజరాతీలూ, హిందూస్థానీలూ కలిసి, తరవాత రాజగోపాలాచారిగారితో మంతనాలు జరిపి, చివరి ముహూర్తంలో సాంబమూర్తిగారిని బోనులో నుంచోపెట్టి, క్రాసుపరీక్షలో (వాదంలో) ఆచారిగారికి కూడా అవకాశం యిచ్చి, చివరికి, సాంబమూర్తి గారిని బడిపిల్లకాయను మందలించినట్టు మందలించడం ఆంధ్రులకు చాలా అవమానకరంగా వున్నది.

ఇది సామాన్యమైన సంగతి కాదు. కాంగ్రెస్సులో మనవారి సత్తా యింత లిగానుగా వుందని వుత్తరప్రభుత్వందాకా వెల్లడియయి పోయిన తరవాత కూడా ఆంధ్రులు చలనం లేకుండా పడి వుండడం అవివేకం.

ఆంధ్రసోదరులు, ఇప్పటికయినా మేలుకుని, వెంటనే సకలానికీ రాజీనామా యిప్పించి సాంబమూర్తిగారిని ముందు ఇవతలికి రప్పించాలి.

పార్లమెంటరీశక్రటరీలు అనవసరం

కరంతుగారు తమ, పార్లమెంటరీ శక్రటరీ వుద్యోగం వదులుకుని వెళ్లిపోయారు.

వెళ్లిపోయా రంటే అది వూరకే వెళ్లిపోవడం కాదు.

కాంగ్రెస్సువారిలో అనేకులకు డబ్బుపితలాటకం యెంత యెక్కువగా వున్నదో, అధికారవ్యామోహం యెంత ముదిరిపోయి వున్నదో, ప్రజాభిప్రాయాన్ని లక్ష్యపెట్టని తమ్మస్సు యెంత ముమ్మరంగా వున్నదో, ముఖ్యంగా రాజగోపాలాచారిగారి పదవీ కల్పన యెంత దారుణంగా వున్నదో వెల్లడిచేసి మరీ వెళ్లిపోయారు వారు.

తెలుసుకోగలిగితే, ప్రజలకు కళ్లు తెరిచే సన్నివేశం యిది. ఏమిటంటే! పార్లమెంటరీశక్రటరీగా తాము చేయించవలసిన దేమీ కనపడలేదు కరంతుగారికి. ఇది యథార్థం కావడంవల్లనే రాజగోపాలాచారిగారు, వారి స్థానే మరివొకర్ని నియమించడం మానేశారు.

పబ్లిక్ సర్వీసు డిపార్టుమెంటు అంటే చిన్నది కాదు. సామాన్యమైనది కాదు. మానవశరీరానికి నరాల నిర్మాణం యెంత ప్రధానమైనదో రాజ్యాంగంలో పబ్లిక్ సర్విస్ డిపార్టుమెంటు అంత ప్రధానమైనది. దానిని నిర్వహించే మంత్రికి శక్రటరీగా వుండే వారికి కేమీ పని లే దంటే—శక్రటరీ లేకపోవడంవల్ల ఆమంత్రి పనులు అడ్డిపోవడం లే దంటే మరి తక్కిన మంత్రులకు మాత్రం శక్రటరీ లెందుకూ?

పార్లమెంటరీ శక్రటరీలు బోలెడేసి జీతమూ, వల్లమాలిన అలవెన్సులూ పుచ్చుకుంటున్నారు; గాని వూరకే కూర్చున్నారా? తక్కిన శక్రటరీ లింకా రాజీనామా లివ్వలేదేమీ? రాజగోపాలాచారిగారయినా వారినుండి రాజీనామాలు కోరలేదేం?

అనుభవించడానికి ప్రజల సొమ్ము తేరగా దొరికిందా?

మధ్యరాష్ట్రాల మంత్రులలో వొక మంత్రి వుద్యోగం వదులుకుని వెళ్లిపోయినా ప్రభుత్వం నిలిచిపోలేదు. యథాప్రకారం అది సాగుతూనే వున్నది. మంత్రులు తగ్గినా నిలిచిపోని ప్రభుత్వం, పార్లమెంటరీ శక్రటరీలు లేకపోతే తక్కిన ఆగిపోతుందా?

అసలు, మన రాష్ట్రంలో, మంత్రులే కొందరు పనిలేనివారున్నారు. మంత్రిపదవులే కొన్ని తగ్గించవలసి వున్నది. అలాంటి స్థితిలో పార్లమెంటరీ శక్రటరీపదవు లయినా వెంటనే రద్దుచెయ్యక పోవడం అక్రమం కాదా?

ఈపదవుల పుట్టుపూర్వోత్తరం యేమి టంటే?

అసెంబ్లీలో వున్న కాంగ్రెస్సువారిలో అనేకులు, జిల్లాలలో మంచి పలుకుబడి కలవారై వున్నారు. వారిలో అనేకులకు పదవులు చూపించవలసివచ్చింది. అందుచేతనే మంత్రిపదవులు పదయినవి. అందరు మంత్రులకూ అన్ని శక్రటరీపదవులు కల్పించవలసివచ్చింది. ఇలాగ యిరవై మంది కయినా మంచి పదవులు కల్పించకపోతే రాజగోపాలాచారిగారికి ఆటకట్టే టట్టు కనబడింది.

ఇదీ వున్న రహస్యం.

కరంతుగారి ధర్మమా అని కాంగ్రెస్సుమంత్రాంగంవారు డబ్బు దగ్గర యెంత జాగ్రత్తగా వుంటున్నారో తెలిసిపోయింది.

ఎన్నో పనులు సొమ్ము లేదని వెనకబెడుతున్న కాంగ్రెస్సు మంత్రుల ద్రవ్యవినియోగపద్ధతి యింత చక్కగా వున్నది.

రమది ప్రజాప్రభుత్వము ట. ప్రజలే తమ చేతిలో ప్రభుత్వాధికారం వుంచారు ట. అయితే, యిలాంటి పదవులు కల్పించుకుని డబ్బు ఆర్జించుకోమనా ప్రజలు కాంగ్రెస్సువారిని శాసనసభలకు పంపారు?

పట్టాభిసచివుని స్టేటుమెంటే యింతపని చేసింది

"మన ప్రైస్ట్రాయి యగు లినులిత్గో ప్రభువు ఇంగ్లాండుకు వెళ్లి అక్కడ మకాము చేసియుండు దినములలోనే మన ఆంధ్రరాష్ట్ర రాయబారవర్గము కూడా ఇంగ్లాండుకు వెళ్లి యీ ఆంధ్రరాష్ట్ర సమస్యవిషయమై ఇండియా కార్యదర్శితో కొంత ప్రచారం చేయుట చాల సముచితము గా నుండును. అట్టి రాయబారవర్గ మొకటి ఇంగ్లాండుకు వెళ్లియెడల, అది కాంగ్రెస్సు వర్కింగు కమిటీయొక్క అనుమతితోనే పోగలదై యుండును."

ఆంధ్రరాష్ట్రనిర్మాణప్రయత్నాల సందర్భంలో యింగ్లండుకు వెళ్లే రాయబారం విషయమై "హిందూ" ప్రతినిధి అడుగగా, జవాబు చెబుతూ, మన పట్టాభి సీతారామయ్యగారు ఇలా మాట్లాడారు.

మనిషి అయిన తరువాత అనేకాలు చుట్టుకుంటాయి. అనేకులతో పని పడుతుంది. అనేక సంస్థలతో సంబంధం వుంటుంది. అయితే: వివేకి అయినవాడు, ఎక్కడ, ఎవరితో, దేనితో ఎంత అవసరమో అంతే సంబంధం పెట్టుకుంటాడు.

ఇలా చెయ్యకపోతే ఆమనిషి వివేకం సన్నగిల్లి అవివేకి అయినట్టుగా చెప్పవచ్చు.

మన కాంగ్రెసాంధ్రులీవిషయం గుర్తించడం లేదు. సర్వానికి వారు కాంగ్రెస్సే సర్వస్వమైన దేవత అని భావించి హాస్యాస్పదు లయిపోతున్నారు.

నిజానికి ఆంధ్రరాష్ట్రానికీ కాంగ్రెస్సుకీ సంబంధం యేమిటి? కాంగ్రెస్సు మనలో కొందరికి మాత్రమే సంబంధించినది. ఇలాగే మనలో జస్టిస్సుపక్షానికీ, లిబరల్ పక్షానికీ, పీపిల్సుపక్షానికీ సంబంధించినవారు కొందరు కొందరు వున్నారు. ఈపక్షాలకు అతీతులున్నూ చాలా మంది వున్నారు; వారు ఒకరి సిద్ధాంతాల నొకరు లక్ష్యపెట్టకపోవచ్చు: కాని ఆంధ్రరాష్ట్రం ఆంధ్రు డైన ప్రతివాడికీ సంబంధించినది. ఆంధ్రరాష్ట్రం మన జాతీయతాంశం. కాంగ్రెస్సులో చేరకపోయినా, జస్టిస్సులో చేరకపోయినా, లిబరల్సులో చేరకపోయినా, పీపిల్సులో చేరకపోయినా ఆంధ్రుని జాతీయతకు భంగం లేదు. ఆంధ్రరాష్ట్రం వద్దంటే—అది పాక్షికసర్వాలకు లోబడి వుండాలంటే మాత్రం ఆంధ్రుని రక్తం కలుషితం అయిపోతుంది.

ఇలాంటి స్థితిలో—జాతి కంతకీ సర్వసామాన్య మైన ఆంధ్రరాష్ట్రం విషయంలో, ఏవలు గురికో మాత్రమే సంబంధించిన కాంగ్రెస్సు అనుజ్ఞ పొందవలసిన దౌర్భాగ్యం యెందుకు రావాలి!

మన ప్రముఖుల, యీలాంటి చిత్తవృత్తే, మొన్నటించీ, మన కోరికలను భంగపరుస్తున్నది. మన ప్రయత్నాలను పాడుచేస్తున్నది. మన ఉత్సాహాన్ని దిగతీసేస్తున్నది.

పట్టాభిసీతారామయ్యగారి స్టేటుమెంటు సరిగా యీ పనే చేసినది.

ఇది, వారు, ఈనెల పదో తేదీ నిచ్చారు. ఈనెల మూడో వారంలో, బొంబాయిలో, కాంగ్రెస్సు వర్కింగుకమిటీ కూడినది. ఆంధ్రరాయబారం నడపడం కోసం, యింగ్లండు వెళ్లతలచి, సాంబమూర్తిగారు, తమ స్పీకరు పదవికీ, అసెంబ్లీ సభ్యత్వానికీ రాజీనామా యివ్వడానికి కాంగ్రెస్సుని కోరిన అనుమతిని గురించి ఆసభలో చర్చకు వచ్చింది. ఆచర్చలో మన రాజగోపాలాచారిగారు ప్రధాన నియంతలై వుండడం మరచిపోవద్దు. సాంబమూర్తిగారికి అనుమతి యివ్వడమా, మానడమా? నియంతల నీసమస్య యెదురుకున్నది.

ఇక్కడ వొక ధర్మసూక్ష్మం వున్నది.

ఇది మద్రాసుప్రెసిడెన్సీకి సంబంధించిన విషయం. మద్రాసు ప్రెసిడెన్సీకి రాజగోపాలాచారిగారు పట్టాభిషిక్తు లయి వున్నారు. కాంగ్రెస్సునిలయంలోకూడా వారికి అసాధారణమైన పదవి వున్నది. తక్కిన కాంగ్రెస్సునియంతల దృష్టిలో ఆచారిగారికీ, మనలో మహామహులం అనుకునే వారికీ చాలా తారతమ్యం వున్నది. అంచేత యీ విషయంలో ఆచారిగారి సలహా పుచ్చుకోకుండా వారు ఎటూ నిర్ణయం చెయ్యరు. చెయ్యలేరు. ఆంధ్రరాష్ట్రనిర్మాణం అంటే ఆచారిగారికి పూర్తిగా వ్యతిరేక మైన విషయం. మనవారి చేత—ముఖ్యంగా మరెవరూ లక్ష్యం అక్కర్లా చూడలేని సాంబమూర్తిగారి సంగతి బాగా వారికి పూర్తిగా తెలుసు.

ఇక కావలసిన దేమి వున్నది!

పైగా, యీసమస్య నియంతల ముందుకు వచ్చేటప్పటికి పట్టాభి సీతారామయ్యగారి యీస్టేటుమెంటు. చివరి చేసిన చంద్రహాసమై రాజగోపాలాచారిగారి చేతికి అందింది.

అసలు, ఇలాంటి ఫలితం రావాలనే "హిందూ" ప్రతినిధి మన పట్టాభి సీతారామయ్యగారిని కదపి వుంటాడు. ఆప్రతినిధి కయినా యిది స్వయంభువు అని మేము నమ్మము. హిందూపత్రిక ఆంధ్రరాష్ట్రానికి ప్రతికూలం కావడం అలా వుండగా "వొకా నొక వ్యక్తి" దీనికి ప్రేరకుడై వుంటాడు. తప్పకుండా వున్నాడు.

మన "పట్టాభిసచివులు" అవలలో చిక్కుకున్నారు. సాంబమూర్తిగారికి అనుమతి పొందడానికి ఆనియంతలకు పట్టాభిగారి వేలే సాధన మయినది.

ఇది యిలా జరిగింది. సంగతి తెలియకుండా యేమనుకుంటే యేమి లాభమూ? మన కాంగ్రెసాంధ్రులకు ఏవిషయం అయినా సమగ్రంగా పరిశీలించే శక్తి లేదు. మన్లో మహామహులున్నారు; కాని ఇతరజాతులవారితో వ్యవహారం వచ్చినప్పుడు వొకరూ నిలవలేరు.

"హిందూ" ప్రతినిధితో మాట్లాడినప్పుడు, మన పట్టాభి సీతారామయ్యగారికీ, రాజనీతికి సంబంధించిన ప్రతిభాకిరణం తెరమరుగై వుండకపోతే, వారు "అట్టి రాయబారవర్గ మొకటి ఇంగ్లాండుకు వెళ్లియెడల, అది కాంగ్రెస్సు వర్కింగు కమిటీ అనుమతితోనే పోగలదై యుండును" అనే మాటలు జారవిడిచి వుండరు.

డిటో ప్రకారమే

"........కాంగ్రెస్సు అనేక సంస్కరణములను గూర్చి తన వైఖరిని స్పష్టము చేసెను. బ్రిటిషుప్రభుత్వము స్వరాజ్యము వచ్చిన దాకా ఆగియుండక వాని నాచరణలో బెట్టియుండవచ్చును. కాని కాంగ్రెస్సు మాత్రము తన సభ్యులను బ్రిటిషుప్రభుత్వము వద్దకు డిప్యుటేషనులతో పంపుట గాని, రాయబారములను పంపుట గాని చాల ప్రమాదకరము. కొద్దికొద్ది సంస్కరణముల కొరకు రాయబారములను పంపుట నా కిష్టము లేదు. ఇట్టి విశాలభావముతో ఆలోచించినపుడు ప్రత్యేకాంధ్రరాష్ట్రముకొరకు కాంగ్రెస్సు తన సభ్యులను ఇంగ్లాండుకు రాయబార మేటుల పంపగలుగునో నే నూహింపజాలకున్నాను."

సుభాసచంద్రబోసుగారు బొంబాయిలో చెప్పిన మాట లివి. వారు, ఈమాట లెందుకు చెప్పారో మే మూహించలేకుండా వున్నాము. కారణమే మాస్తే, ఆంధ్రరాష్ట్రప్రశ్నకు సంబంధించిన అంశమేమీ బోసుగారికి తెలిసినట్టు లేదు.

ఆంధ్రరాష్ట్రాన్ని గురించి యెవరో వారికి వినుగుడుమాటలు చెప్పారు. వారు వాటిని మాత్రమే జీర్ణించుకొని వున్నారు. వర్కింగుకమిటీలో, పేరుపొందిన ఆంధ్రప్రతికూలు రైన పటేలునెహ్రూ ప్రభృతులు, సాంబమూర్తిగారి రాజీనామా అంగీకరించకూడ దన్నారు. బోసుగారు "డిటో ప్రకారమే" అన్నారు. అంతే.

కాంగ్రెసుప్రముఖుల వ్యవహారపరిజ్ఞానమూ, వ్యవహారదక్షతాయింత చక్కగా వున్నవి.

మొన్న జరిగిన సంగతి చూడరాదూ?

ఆయన జిన్నాగారితో చర్చించారు. ఇటు గాంధి, పటేలు, నెహ్రూ, రాజగోపాలాచారి, బోసు ప్రభృతులు సదులు, ఇన్ని వైలు, యాభైలు, వందలు. అయినా జిన్నాగారికి సరియైన సమాధానం చెప్పలేకపోయారు.

ఎలా అవుతుంది? ఏదో వొక నాయకుడు నిర్ణయించుకోవడం. ఎన్ని సమస్యలు వచ్చినా ఆనాయకుడు విడిచిపెట్టకపోవడం. కాంగ్రెసువారు కలగతొక్కుకోకుండా స్థిరంగా నిలవగలిగినా. ఇప్పటి మహమ్మదీయులలో వున్న యోగ్యత యిది.

మన కెప్పుడూ లేనిదీ ఈ యోగ్యత.

మన కాంగ్రెస్సుప్రముఖుల ప్రవృత్తే దీనికి పూర్తిగా నిదర్శనం. అవును మరి. ఇలాంటివా రందరూ కాంగ్రెస్సు అధ్యక్షు లవుతున్నప్పుడు, కాంగ్రెస్సు ఐకమత్యం నిశ్చితంగా యెలా వుంటుందీ? సరియైన స్థితిలో మాత్రం యెలా వుంటుందీ?

సాంబమూర్తిగారు, తాము, ఇంగ్లాండు వెళ్లగలగడానికే, తను స్పీకరుపదవికీ, అసెంబ్లీసభ్యతకీ రాజీనామా యివ్వడానికి కాంగ్రెస్సు అనుమతి కోరారే గాని, "ఆంధ్రరాష్ట్రం సాధించడానికి కాంగ్రెస్సుపక్షంగా యింగ్లాండుకు రాయబారం పంపవలసిం" దనీ, "ఆరాయబారవర్గంలో తమ్మి కూడా చేర్చవలసిం" దనీ ప్రార్థించారా!

మరి బోసుగారి యీమాటలకు ఆధారం యేమిటి? ప్రయోజనమున్నూ యేమిటీ?

సాంబమూర్తిగారింగ్లాండు వెళ్లడమే వస్తే మళ్లీ అసెంబ్లీ కూడేలోపున తిరిగి రావడానికి వీలవుతుందో కాదో? కాకపోతే కాకపోతుం దనే—యిక్కడ మరొకరికి స్పీకరును ఏర్పాటుచేసుకోవాలి. లండనులో ఆకామే పెట్టవలసివస్తుం దేమా? అలా అయితే కాకినాడ వోట్ల ప్రాతినిధ్యం కూడా భంగపడిపోతుంది. కనక మరొక సభ్యుణ్ణి యెన్నుకోడానికి వారికి అవకాశం వుండాలి.

ఈకారణాలవల్లనే సాంబమూర్తిగారు ఆపదవులు విడిచిపెట్టవలసివచ్చి వుంటుంది. కాంగ్రెస్సుపావలాసభ్యత యెక్కడికి వెళ్లినా పోదు. పోయినా యెవరికీ నష్టం లేదు. నిజంగా పోవడమే వస్తే మళ్లీ పావలాడబ్బు లెవ్వరైనా చెల్లిస్తే అప్పుడే అది మళ్లీ సంక్రమిస్తుంది; కనక యిప్పు డది విడిచిపెట్టనక్కరలేదు.

ఆపావలాసభ్యత వున్నంతకాలమూ కూడా సాంబమూర్తిగారింగ్లాండు వెళ్లకూడ దనడం వివేకం కాదు. ధర్మం కాదు. సాంబమూర్తిగారాంధ్రులు. కాంగ్రెస్సుని గౌరవిస్తూ వారు సొంత జాతీయతను కూడా గౌరవించుకోవలసివుంది. జాతీయతకోసం సాధించుకోవలసి వుంది. ఇంగ్లాండు వెళ్లిపని చేస్తే గాని రాష్ట్రనిర్మాణం కాదు. రాష్ట్రనిర్మాణం అయితే గాని ఆంధ్రజాతి కోలుకోదు. ఇంత ఉత్కృష్టమైన పని చెయ్యకుండా సాంబమూర్తిగారూరుకోవలసిం దేనా! ఆంధ్రుల పాట్లు, ఆంధ్రుల లోట్లు, ఆంధ్రుల భావసరణి, ఆంధ్రుల అవసరాలు, ఆంధ్రుల జాతీయగౌరవం ఈ యింగ్లీషువాళ్లకేం తెలుస్తాయీ? వంగవిభజన రద్దు చేయించుకోడానికి ఆదిలో తమ యింగ్లీషుప్రముఖు లెన్ని పాట్లు పడ్డారో యీ బోసుగారు వూహించుకోగలిగారా? దానికోసం తమవారు కొందరు ప్రాణాలకు కూడా తెగించి పని చేసిన వృత్తాంతాలు ఈకాంగ్రెస్సు అధ్యక్షమహాశయునకు అవగాహన అయివున్నాయా!

ఇటీవల బ్రిటిషుపార్లమెంటు మెంబర్లు వ్యక్తిగతంగా యిండియాకు వచ్చి, అన్ని పక్షాల నాయకులతోనూ మాట్లాడి, చివరికి కాంగ్రెస్సుసమావేశం కూడా చూసి వెళ్లారే? వారు తమ పార్లమెంటు సభ్యత్వం విడవకుండానే వచ్చి యిదంతా చెయ్యడం వీరెరుగుదురా? దానివల్ల వారి నెవ్వరూ ఆక్షేపించకపోవడం కూడా వీరెరుగుదురా?

ఎటు చూసినా బోసుగారి మాటలు శుష్కానువాదంగా వున్నాయి. వాటికి అర్థం లేదు.

"ఆందోళన మెండినను లేకపోయినను, అధికారము వచ్చినపుడు కాంగ్రెస్సు తన తీర్మానమును ఆచరణలో పెట్టెను. ఈలోపల ఆంధ్రులే తమ మనస్సులు మార్చుకొనిన యేమియు చేయగల దేమియు లేదు" అని చివరకు బోసుగారన్నప్పుడు, వారిని కలుసుకొని మాట్లాడిన ప్రతినిధి "ఆంధ్రులు తమ మనస్సును ఎప్పుడును మార్చుకొనరు" అని వెంటనే "అడ్డుపలకడం" కంటే "ఇది మీ స్వబుద్ధివల్ల చేసుకున్న నిశ్చయ మేనా?" అని అడ్డసవాలు వేసివుంటే బాగుండేది. కాని మన నాయకులకే లేని ధైర్యసాహసాలు వొక్కానొక రిపోర్టరుకు లేకపోవడం ఆశ్చర్యకర మైన విషయం కాదు.

"కాలో హ్యయం నిరవధిః"

"మీ రిద్దరును ప్రారంభించిన నిరశనదీక్ష నీతిపై నాధారపడినది కాదు. తమకు సమ్మతములు కాని పనులు నిజముగా జరిగినపుడును జరిగినట్లు తోచినపుడును ప్రజలు నిరశనదీక్షను బూనుట అనుచితము. ప్రతి విషయములోను అట్టివారికి లొంగి ఆపనులను మానివేయు నెడల సంఘమున చీలికలు కలుగును"

అర్థడాక్సు కాంగ్రెసువాద, ఏ. మాణిక్యం (సేలం) గారికి గాంధీగారు పంపిన తంతి యిది.

గాంధిగారి విద్యాంకుల నిర్బంధహిందీవిధానానికి అసమ్మతి తెలపడానికి మాణిక్యంగారు నిరశనదీక్ష పట్టారు. గర్భవతి అయిన ఆయన భార్యకూడ ఆదేవ్రతం పట్టింది; కాని భార్య శ్రమ చూడ లేక ఆయన వ్రతం మానేశారు.

"ఇతడు నిరశనదీక్షను వదలకపోయిన యెడల ప్రజలు వివేకమును గోల్పోయి ఆందోళనము ప్రారంభింపగూడదు. ఒకడొకని శరీరమునకు బాధ కలిగించుట గూడ దౌర్జన్యమే గాని యిట్టి నిరశన దీక్ష మిక్కిలి అధికమగు దౌర్జన్యము. ఒకడు మరియొకని బాధించుటలో దౌర్జన్యము మాత్రమే కలదు; గాని కపటము లేదు. అహింసానిరతుడ నను మిషతో నొకడు నిరసనదీక్షను బూనునెడల అతడు ప్రజలను మోసగించినవాడు కూడ నగును. దీనిలో రెట్టింపు దౌర్జన్య మున్నది"

నిర్బంధహిందీ విధానానికే అసమ్మతి తెలపడానికి కే. ఎస్. జగదీశన్ గారు, మాంబలంలో నిరశనవ్రతం పట్టారు. ఇది విని గాంధీగారు తమ హరిజనులో రాసిన రాత యిది.

౧౯౩౪ నవంబరులో, సాధువరదరాజం పంతులు గారికి సలహా చెబుతూ, మేము "..... కాని నిరశనవ్రతం అవలంబించడం మేము ప్రశంసించలేము. నిరశవ్రతం స్త్రీలకుకూడ నింద్యమైన పని. ఇది అసమర్థతకూ, అనౌచిత్యానికీ గుర్తు" అని రాసి వున్నాము.

గాంధిగారే యీనిరశనవ్రతానికి సృష్టికర్తలు. ఎన్నో మాట్లు యెన్నో పనులకోసం వారీ పని చేసి వున్నారు. వారిని చూసే, ఇటీవల, దేశీయులలో కొందరీదుష్కృత్యానికి పూనుకునివున్నారు. పూనుకుంటున్నారు. కాంగ్రెసుకి అధికారం రాకపూర్వం భారతదేశపు జెయిళ్లలోనూ, అండమానులలోనూ వున్న రాజకీయఖైదీలకు ఈ వుపాయం గాంధిగారుపదేశించకుండా వుండలేదు. కాంగ్రెసువారు ప్రోత్సాహం చూపించకుండా వుండలేదు. అధికారం చేతికి వచ్చి తామే పరిపాలన సాగించవలసివచ్చాటప్పటికి వారికి ఇది కంటకప్రాయం అయికూచుంది.

ఇవాళ గాంధిగారే నిరశనవ్రతాన్ని నిరసించడం నీతిమాలిన పని. అందులో దౌర్జన్యం వున్న దనడంలో కూడా దౌర్జన్యం మిక్కుటంగానే వున్నది.

పైగా, మాణిక్యం జగదీశన్ గార్ల నుద్దేశించి "ప్రతివిషయము లోను అట్టివారికి లొంగి ఆపనులను మానివేయునెడల సంఘమున చీలికలు కలుగును" అనీ, "ఇతడు నిరశనదీక్షను వదలకపోయిన యెడల ప్రజలు వివేకమును గోల్పోయి ఆందోళనము ప్రారంభింపగూడదు" అనీ గాంధిగారు రాసిన వాక్యాలలో మానవ హృదయం యెంత మాత్రమూ కనపడ్డం లేదు.

తమ నమ్మకం విడిచిపెట్టలేక వారు చచ్చిపోయినా అంతేనా? వారి ప్రాణాలంత చవక అయినవా! నిర్బంధహిందీవిధానం విడిచిపెట్టేస్తే కాంగ్రెసు చచ్చిపోతుందా? ఇతరరాష్ట్రాలలో యీ విధానం అవలంబించలేదేమీ? దక్షిణదేశీయులు తమ మాతృభాషలకు నీళ్లు వదులుకోవలసిందేనా?

నామమాత్రమైన అధికారం చేతికి వచ్చినంత మాత్రాన్నే ఇంత రాక్షసపాలనం ప్రారంభించిన గాంధిగారూ, వారి అనుచరులూ, నిజంగా అధినివేశప్రతిపత్తి అయినా చేతికందితే — అప్పుడూ తామే మెజారిటీలో వుండడం తటస్థపడితేతూర్పున పొద్దుపొడవనిస్తారా?

కాని, ఒక విధంగా చూస్తే యిప్పుడీ గోతులు తయారు కావడం మంచిదే. తయారయివుండడం అవసరమే. వాటికి వినియోగం జరిగే సుముహూర్తం అదిగో దగ్గిరదగ్గిరకే వస్తున్నది.

కనుచూపుమేరలోనే

కాంగ్రెసు నియంతలలో క్రిమినల్ నాయకులుగా పనిచేసి అరితేరి వున్నవారు చాలామంది వున్నారే? ఏం, షరీఫ్ గారి విషయం వారెందుకు పరిష్కరించకపోయారూ? ఒక రిటైర్డుజడ్జీస్సుని ఆశ్రయించవలసిన అవసరం యెందుకు వచ్చిందీ?

ఎంత వోపిక పట్టినా దాచలేనన్ని కనపడక, చివరికి బయటపడిపోయి, యేకకాలంలో ముగ్గురు మంత్రులు రాజీనామా యిచ్చెయ్యవలసినంత నిరంకుశంగా ప్రవర్తించారే సీ. పీ. ప్రధానమంత్రిమహాశయులవారు! వారి విషయంలో యీలాంటి విచారణ చేయించలేదేమీ?

రాజకీయఖైదీల సందర్భంలో రాజీనామా యిస్తామని నిర్వాకట్టూ పెంచి, "అత్యుచ్చమైనిక విజయం" పొందివున్న యు. పి. బీహారు మంత్రులు, రాజకీయఖైదీలలో చాలామందిని యింకా జెయిళ్లలో మగ్గబెట్టే వుంచారే? దోషిని విడిచిపెట్టకపోయినంటే, నిర్దోషులను బాధించడం రాక్షసాంశ అనే అత్యుచ్చనీతితత్వం కాంగ్రెసునియంతలకు స్ఫురణకు వచ్చే పరిస్థితి లెప్పటికయినా కలుగుతాయా?

కాంగ్రెసు జీవితంలో, యివి మూడూ, పాతాళం చూపించే మూడు సుడిగుండాలు.

వీటివల్లవచ్చే అపాయం కాంగ్రెసుప్రముఖులతో నేపోదు లెక్కలేనంతమంది అమాయికప్రజలను గూడా అది చుట్టబెట్టుకుంటుంది.

సరిగా "ఏడు" రాష్ట్రాలలో స్వామ్యాలమయి వున్నామనే పొంగు, కాంగ్రెసువారి సంకుచితచిత్తాన్ని, మరింత సంకుచితపరిచి వున్నది. ఇంతలో, సుఖసుఖాల, అది దారికి వచ్చే చిహ్నాలు లేవు.

అవతల ఫెడరేషను రూపొందబోతున్నది. ఇవతల ముస్లింలీగు వుచ్చులు బిగిస్తున్నది. అటు హిందూమహాసభ వుక్కిరిబిక్కిరి కలిగిస్తున్నది.

దేశానికి కాంగ్రెసువల్ల మూడే ముప్పు దూరంగా లేదు. కను చూపు మేరలోనే వుంది.

ఆధారములు

అని జనస్వామి కోదండరామశాస్త్రిగారి ఒక కథల సంపుటి. కొన్నాళ్లనుంచి, చిన్నకథా—ఖండకావ్యం — ఏకాంకరూపకం, అన్నిసారస్వతాల్లో వలెనే ఆంధ్రసాహిత్యంలో కూడా బహుళ ప్రచారానికి వచ్చాయి. తత్రాపి—చిన్నకథ రచన పెద్దకష్టం. దానిని ప్రారంభించి పెడత్రోవలు పట్టకుండా సూటిగా నడిపించడం మరీ పూచీతో కూడుకొన్న పని—నవ్యసాహిత్యప్రియులలో ఈరచనను అవలంబించిన వారూ చాలా మంది. అకృతార్థులున్నూ అనేకమంది. ఈ కథానికాసంపుటం చదువుతూండగా మొదట కలిగేది కొన్ని కథలు బాగుంటవేమో అనే ఆశ. పిమ్మట వచ్చేది నిస్పృహతోడి నిట్టూర్పు. ఏమని అడగండి. ఉత్తమకథానికల కుండవలసిన ఘటనాప్రతిఘటనలతో కూడిన వస్తువైచిత్రి దీనిలో ఏకథకూ లేదు.

మధ్యమకథానికల కుండే పలుకుటందమూ, భావశిల్పమూ ఇందులో ఎక్కడనో గాని కనిపించవు. ఇక—ఈ కథకుడు తన కున్న సంస్కారభావ సామగ్రితో ఈకథలను పన్ని లోకాన్ని బాగుచేయదలచినట్లు తోస్తుంది. గొల్లపిల్లవాడు అబద్ధముగా పులి యని యరచెను. అందరును వచ్చి లేదని వెళ్లిపోయిరి. నిజముగా పులి వచ్చెను. గొల్ల అరచెను. ఎవ్వరును రాలేదు. కనుక అసత్య మాడరాదు. అనే కథలోని నీతి ప్రచారంకంటే ఈకథాసంపుటి కథలలోని ఉపన్యాసాల విశేషం నాకు బోధకాలేదు. ప్రచారం కోసం వ్రాసిన కథలను ఎంత సమర్థులు వ్రాసినవైనా సహృదయుడు కళాపరంగా చదువుకొని ఆనందించలేడు. ఏమైనా ఈసంపుటము మొత్తముమీద నాకు చదవడానికి సహ్యములుగా వున్నవి 'ఘనాని' 'కన్నీటి కెరటాలు' అనే రెండు కథలూను. వీనిలో కూడా, ఎంతో అసహజత్వమున్నా కొన్ని ఘటనలు ప్రతిఘటనలూ వున్నాయి. కొంతకు కొంత భాషకూడ బాగుంది.

చిక్కిన కథలలో 'తాయారు' మొదలైన వాటిలో చక్కని నడకే లేదు. 'ఆనందభంగము' వంటి కథల్లో ఏమీ విశేషం లేదు. భాష చాలా ఒడుదుడుకుగా వుంది మొత్తంమీద. సామాన్యసంభాషణలో 'అభియోగం' 'ఆందోళన' వంటి మాటలు కృత్రిమంగా వుంటాయి. అవసరం లేనిచోట 'ఫ్రెండు' వంటి ఇంగ్లీషు మాటలు వాడడం లేవడితనానికి గుర్తు. రెండవభాగములోని కథల్లో అసలే కథాత్వమూ—చమత్కారమూ లేదు. వుత్త 'ఈసప్ ఫేబిల్స్' వలెగా వున్నాయి. మొత్తంమీద—ఈకథకుడు ఇంకో కథలసంపుటి వేయవలసివున్న దని నా అభిప్రాయం. వేసేముందు తెనుగులో మంచి కథానికారచయితల రచనలు చదివి ధోరణి అవగాహన చేసుకోవలసిం దని ఆప్తబుద్ధితోడి నా సలహా. ఇ. సా.

రాష్ట్రగానము

గాయకులు (గ్రంథకర్త) ఉభయభాషాప్రవీణ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు, హైస్కూలు పండితులు. బాపట్ల. క్రౌను ౩౨ పేజీల గ్రంథం. వెల నాలు గణాలు. అంటికట్టు కాగితాలు. అచ్చు ముచ్చటగా నున్నది. ఈగ్రంథం శ్రీ వల్లభపల్లి రాజావారి కంకితం చెయ్యబడ్డది.

ఆంధ్రరాష్ట్రానికి సంబంధించిన ఆవేదన చౌదరిగారి యీరచనకు ముఖ్యకారణం. ఇది ప్రశంసించతగ్గ విషయం; కాని భావంలో ఉత్సాహానికి తగ్గ పాటవం లేదు. పద్యరచనలో చౌదరిగారి చెయ్యి యింకా సరిగా తిరిగి లేదు. చాలా పద్యాలలో ప్రక్రమభంగం కనపడుతున్నది. "ఎన్నడో వచ్చిన వీనులన్ నిగుడు వచ్చిన కొమ్ములు వెక్కిరించెడిన్" ఇది అశ్రుతపూర్వం. "ముందు వచ్చిన చెవుల కంటే వెనక వచ్చిన కొమ్ములు వాడి" అనే సామెత యిలా మారిపోయింది. "ఒక్క ఏమేనమున్ నిలువ నోడ్డెల వైవస మైన గడ్డలో" "గడ్డపై" అనాలి. "తెల్గుబిడ్డ నెదిరింపను బ్రహ్మరుద్రాదులే చేరంజాలరు" చేరంజాలరు, కంటే "ఓపజాలరు" బాగుంటుంది. ఇలాంటి తేడా లక్కడక్కడ వుండినా, మొత్తానికి, గ్రంథం బాగున్నది. ఆంధ్రరాష్ట్రవాంఛ మళ్లీ రేకెత్తిన యీ సమయంలో యీరాష్ట్రగానం దేశీయులకు ఉత్సాహశక్తి కలిగించగలదు.

మీసాలంటే చౌదరిగారికి చాలా ప్రేమగా వున్నది. ఆంధ్రులందరూ మీసాలు గొరుగుకొనేవారని అజ్ఞ; కొందరైతే కొనలను మాత్రం వారనుగ్రహించారు. ఎవ రేంచేసినా వారిసర్వోత్తము రావుగారూ, కొల్లిపర సూరయ్యగారూ, కోటి రెడ్డిగారూ, గద్దె రంగయ్యనాయుడుగారూ అయినా శాశ్వతంగా మీసాలుంచుకొని చౌదరిగారికి నిరుత్సాహం కలిగించకుండా వుంటారని నమ్ముతున్నాను. "కోదండమును మ్రోదరకక్కలవోలె" కాక "గల్లుపువ్వులా" వున్న రంగయ్యనాయుడుగారి మీసాలకు, చౌదరిగారు, మన హాయింపు అనుగ్రహిస్తారని కూడా నేను నమ్ముతున్నాను.

ఏ. కే. మూర్తి

సుభాషచంద్రబోసు

ఇందు బోసుగారి జీవితమును, కొన్ని యుపన్యాసములు నున్నవి. గ్రంథకర్త శ్రీమాన్ కొమాండూరి శఠకోపాచార్యులు ఎం. ఏ. బి. ఎల్. గారు. కాకినాడ. గ్లేజు కాగితములు. అచ్చు బాగుగనే యున్నది. క్రౌనుపరిమాణమున 108 పుటల గ్రంథము. మూల్యము ఆఱణాలు.

వ్యయప్రయాసల కోర్చి, ఆచార్యులుగారు, బోసుగారి జీవితమును నేటివఱకును ఇందు వర్ణించినారు. అనేకములైన ఆధారముల ననుసరించి కూర్చబడినది: గాని యిది యొక గ్రంథమున కనుకరణమును అనువాదమును గూడ కాదు. స్వతంత్రరచన; కాని భాషలో లోపము లనేకము లున్నవి. ఆవిషయమున ఆచార్యులుగారికి శ్రద్ధ యున్నట్లుకూడ కనపడదు. ఇట్టి ఉపయుక్తగ్రంథములు రచించి ప్రకటింపబూనిన ఆచార్యులుగారు భాషావిషయమున అశ్రద్ధ చేయుట భావ్యము కాదు. వా. నా. శాస్త్రి.

కలిక

(చిన్నకథలసంపుటం) భొడ్డుబాపిరాజుగారు రచించినది. వెల నాలుగు అణాలు, యువకార్యాలయం, తెనాలి.

శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు గొప్పకథకులే గాక యువకార్యాలయం ద్వారా చిన్నకథలసంపుటాలు కూడా ఎంతో కష్టపడి ప్రకటించి ఆంధ్రలోకానికి అత్యల్పధరలలోనే అందజేస్తున్నారు. ఆంధ్రులు వీరి ఉద్యమాన్ని ప్రోత్సహిస్తారుగాక!

వారి అరవప్రచురణం "కలిక" ఈ కథాసంపుటికర్త భొడ్డుబాపిరాజుగారు. బాపిరాజుగారిని ఆంధ్రలోకం ఆధునిక మహాకవిగా ఎరుగును. ఆయన మహాకవే గాక గొప్ప కథకుడని కూడా ఈ సంపుటి తెలియచేస్తూంది. ఈ సంపుటంలో తొమ్మిది చిన్నకథలున్నాయి. కథకునికి ఉండవలసిన భాషాపాండిత్యం ఈయనికి పుష్కలంగా ఉంది. కథలుచెప్పే నేర్పు గొప్పకథకునికి అవసరమాయి నంతా ఈయనికి ఉంది. ఈసంపుటంలో గంభీరమైన (Serious) కథలేగాక హాస్యరసకథలు కూడా ఉన్నాయి.

నాకనిపించిన యాభిప్రాయం ఈకిందిది. బాపిరాజుగారు హాస్యకథలు రాయడంలో చూపించిన నేర్పు గంభీరమైన కథలలో చూపించలేదు. అంత బొత్తిగా లేదనికాదు. "విధి" అనేకథ బహుముఖ్యంగా రచించారు. కాని హాస్యకథలో! అవి అద్భుతంగా ఉన్నాయి. వీరు రచించిన "చిల్లిచెంబు" కథ నేటి హాస్యకథల సెలక్షన్సులో ప్రకటించతగింది. అంతి చక్కనికథ. మిగిలినహాస్యకథలు "దొంగవెయ్యాలు" "కిటికీరెక్కలు" చక్కగా ఉన్నాయి. హాస్యధోరణిలోనే రచించబడిన కథ "పుణ్యాత్ములు" గంభీరమైన కథలలో కూడా హాస్యగాయులు అనవసరమైనచోట్ల అక్కడక్కడ కనబడి వాటిని రుచిహీనం చేస్తున్నాయి.

బాపిరాజుగారి కథారచనలో నాకు కనబడే లోపమీకిందిది. అలంకారిక శైలికి ఒకహద్దుఉండాలి. పద్యాలలో నెక్కలేనన్ని అలంకారాలు వాడుతూన్నమాట నిజమే. అందులోనూ అధికంగా వాడిన ఆపద్యాలు అసహ్యంగా ఉంటూన్నమాటా నిజమే. కాని వచనంలో అలంకారానికి పద్యంలోఉన్న తావులో నాలుగోవంతేనాలేదు. శైలి వీలయినంత సహజంగా ఉండడమే వచనానికి సుగుణం. ఈగుణం కనకి బాపిరాజుగారి రచనలో ఉంటే బంగారానికి పరిమళి మబ్బినట్టుగా వుంటుంది.

వైశ్యశీలాలంకారుడును, మహాకవియు, హాస్యరసప్రపంచమునును అయిన బాపిరాజుగారి కథక నైపుణ్యాన్ని కూడా ఆంధ్రదేశం చవిజూచుగాక! యువకార్యాలయంవారు ఇటువంటి గ్రంథాలు మరికొన్ని ప్రకటించి ప్రశస్తమైన కథావాఙ్మయం తెలుగుదేశంలో వృద్ధిచేస్తారుగాక! — ఉమమళ్ల కామేశ్వరరావు

ఆయుర్వేదప్రభాతము

ఇది మాసపత్రిక. తూర్పు గోదావరిజిల్లా దేశీయవైద్యసంఘము తరఫున ప్రచురించబడుతున్నది. సంపాదకులు ఆయుర్వేదాచార్య తేజోమూర్తుల గురునాథం ఏ. ఎం. ఏ. సి. గారు. రామచంద్రపురం తూర్పు గోదావరిజిల్లా. సంవత్సర చందా ౨-౦-౦. రాయలు సైజున ౩౦ పేజీలు.

సంపాదకుల ఉద్దేశాలు చాలా చక్కగా నున్నవి. ఈమొదటి సంచికలో వాటికి తగిన రచనలు తక్కువగా వుండినా క్రమంగా ఆలోపం తీరుతుం దని నమ్ముతున్నాము. సంపాదకులు సమర్థులు. ఆవేదన కలవారు. పత్రికను సర్వలక్షణసంపన్నంగా నడిపించగలవారు. ప్రాతఃస్మరణానికి సంబంధించిన వ్యాసంలో మరికొన్ని వివరాలిచ్చి వుంటే చాలా బాగుండేది. అందులో సవరణలు కూడా చెయ్యవలసివున్నది. అయితే పత్రికలో దానిని గురించి వరసగా రాసే సూచనలు లేకపోలేదు. పత్రిక చిరకాలము ఆయుర్వేదప్రచారం చేస్తుం దని నమ్ముతున్నాము. మా మిత్రులు గురునాథంగారు, చీలిపోయి వున్న ఆంధ్రాయుర్వేదవైద్యులకు ఐకమత్యం కలిగించే ప్రయత్నాలు కూడా శ్రద్ధగా చెయ్యవలసి వున్నది.

మహతి

మాసపత్రిక. సంపాదకులు వానిరెడ్డి వెంకటసుబ్బయ్యగారు. తెనాలి. సంవత్సరం చందా ౨-౦-౦ రాయల్ సైజున ౮౦ పేజీలున్నది. గెటప్పు చక్కగా వున్నది.

ఈ మొదటి సంచికలో వున్న రాయప్రోలు సుబ్బారావుగారి తెలుగుబంతీ (పద్యాలు) కొడవటిగంటి కుటుంబరావుగారి సారస్వత సేవకుడూ (చిన్నకథ) శరణు రామస్వామి చౌదరిగారి ఆత్మబలీ (క్యూరాగల్ అయినీ అను పర్షియన్ యువతి జీవితసఫలత వర్ణించిన చారిత్రిక వ్యాసం), జమ్ములమడక మాధవరామశర్మగారి కావ్యప్రమేయమూ, పత్రిక భావ్యభివృద్ధికి తగిన మైన సూచకాలై వున్నవి. సంపాదకుల ప్రాస్తావిక పెద్దపెద్ద ఆశలను పురికొల్పుతున్నది: కాని పట్టాభిసీతారామయ్యగారి రచనను, (అణోరణీయాన్ మహతో మహీయాన్) సంపాదకులు ఏమి చూసి, ఏమనుకుని, ఏమి కోరి ప్రకటించారో తోచకుండా వుంది. ఇక ముందయినా సంపాదకులు రచనలవిషయంలో శ్రద్ధకనపరుస్తా రని నమ్ముతున్నాము. మహతి సాఫల్యం పొందా లనిన్నీ కోరుతున్నాము.

పాపం, సంపాదకులకు ఈనెల 3 వ తేదీని పత్నీవియోగం సంభవించినది. ఉత్కృష్టకార్యనిర్వహణానికి పూనుకున్న కొత్తలో యిలాంటి విపత్తు రావడం చాలా చింతాకరంగా వున్నది. వారికి మా సానుభూతి అందచేస్తూ పత్రిక అభివృద్ధిని కోరుతున్నాము.

హిందీ ముప్పు తెచ్చి పెడుతుంది

సి. పుల్లయ్యగారి సత్యనారాయణ వ్రతం.

స్థలాభావంవల్ల యీరెండువ్యాసాలూ ఈసంచికలో ప్రకటించలేకపోయాము. ఇక వచ్చే సంచికలోనే.

అచ్చులో నున్నది!
మంచి గ్లేజుకాగితము!
సొగసైన క్యాలికోబైండు!!

వస్తుగుణప్రకాశిక

సరస్వతీ పవర్ ప్రెస్‌వారి
ప్రచురణము
రాజమండ్రి

పుస్తకములో వస్తుగుణప్రబోధముగల పేజీలు 1000 పైగా నుండును. వెల ప్రతి 1 కి **5—0—0**

ఇది సమస్తద్రవ్యగుణములను అసందిగ్ధముగ తెలియజేయు అపూర్వగ్రంథరాజము. ఆంధ్రవైద్యలోకమునకు, వైద్యేతరులకును మిక్కిలి యుపయోగకర మగునటుల బ్రహ్మశ్రీ ఆయుర్వేదభూషణ భిషగ్వర పండిత పీటూరి వాసుదేవశాస్త్రి, ఏ. యం. ఏ. సి. గారిచే వ్రాయబడినది. ఇందు సందిగ్ధద్రవ్యములన్నియు నిర్ధారణచేయబడి ప్రచురింపబడినవి. నూతనపరిశోధితద్రవ్యములు చేర్చబడినవి. వస్తువునందలి రసవీర్యవిపాకప్రభావములను గుణములను విడదీసి వస్తుప్రాధాన్యము నిరూపింపబడినది.

వస్తుగుణప్రకాశిక మాదిరి పేజీ

కామంచిచెట్టు-కాసరచెట్టు :—కాకమాచీ—Solanum Nigrum.

పరిచయపదములు బహుఫలా—బహుఫలములు కలది. గుచ్ఛఫలా—గుత్తులుగుత్తులుగాపండ్లుకాయునది. గుణప్రకాశక పదములు రసాయనవరా—రసాయనమునకు శ్రేష్ఠమైనది. కుష్ఠనాశనీ—కుష్ఠరోగమును బోగొట్టునది.

స్వరూపము దీనినే కాసరచెట్టనియు, గాజుచెట్టనియు గూడ నందురు. ఇది భూమిపైన గజమెత్తు వరకును బెరుగును. దీని కాయలు గుండ్రముగా చిన్నముత్యములవలె గుత్తులుగుత్తులుగా కాయును. కాయనిండా గింజ లుండును. పచ్చికాయ ఆకుపచ్చరంగుగా నుండును. ఎరుపు నలుపు రంగులచే నిది రెండువిధములుగా నున్నది. పండ్లయొక్క రంగును బట్టియే జాతిని నిర్ణయించవలెను. నల్లజాతి పండ్లు నల్లగాను, ఎఱ్ఱజాతి పండ్లు యెఱ్ఱగాను యుండును. పువ్వులు తెల్లగా నుండును. ఆకు మిరపఆకులను బోలి యుండును.

గుణములు దీని సర్వాంగములును గూడ కొంచెము కారము చేదును గలిసిన రుచి గలిగి యుండును. ఉష్ణవీర్యము గలది. విపాకమున కారపురుచిగ మారును. విరేచనము జేయు స్వభావము గలవి. లఘురూక్షగుణముగల ద్రవ్యము. త్రిదోషములను గూడ శమింప జేయును. కంఠస్వరమును బాగుచేయును. కుష్ఠరోగమును హరించును. వీర్యవృద్ధి గలిగించును. ఇది రసాయనద్రవ్యము. శూలలు, మూలవ్యాధులు హరించును. ఉబ్బు విషదోషములు హరించును. మేహరోగములను తగ్గించును. నేత్రములకు హితమైనది. ఎక్కిళ్లు, వాంతులు, హృద్రోగములు హరించును.

ప్రయోగములు కుష్ఠరోగమునకు :—కామంచికూర ముద్దగా నూరి పైన నలుగుబెట్టిన కుష్ఠరోగములు శమించును.

విసర్పికి :—చేదుపుచ్చఆకును, కామంచియాకును వేరువేరుగా గాని, కలిపిగాని నూరి పైన రాసిన విసర్పిరోగము శమించును. పై ముద్దలో కొంచెము నెయ్యి కూడ కలపవలెను.

ఉబ్బులకు :—కామంచిఆకు కూర వండి పెట్టిన ఉబ్బులు శమించును.

ఊరుస్తంభమునకు :—కామంచిఆకు నీళ్లతో యుడికించి నూనెలో వేయించి తినిన యూరుస్తంభము హరించును. (చరకము)

ఎలుకవిషమునకు :—కామంచిఆకు స్వరసమును పైన పూసిన యెలుక విషము హరించును. ఆకు రసము రెండు డబ్బులయెత్తు లోనికి తీసికొనినను, విషము హరించును. (సుశ్రుతము)

పిల్లమను నేత్రరోగమునకు :—కామంచిపండ్లు నేతితో నూరి కంటికి ధూపము వేసిన పిల్లమను నేత్రరోగము హరించును. క్రిములు కూడ పడును. కామంచికాయల గింజలు చూర్ణము చేసి కషాయము పెట్టి ఆ కషాయములో తేనె కలిపి త్రాగిన అతిమూత్రములు, మధుమేహము కట్టును.

గ్రామ్య ప్రయోగములు ఆకు రసము చెవిలో పిండిన కర్ణశూలలు హరించును. చీము కారుట కట్టును. చెవిలో పురుగులు చచ్చును. గర్భోత్పత్తిని గలిగించును.

సరస్వతీగ్రంథమండలి

కంభంవారి సత్రమువీధి *** రాజమహేంద్రవరము

నవలలు—నవరసభరితములగు నవలలు—ముచ్చటగూర్చు అచ్చుతో—ముద్దులొలుకు క్యాలికో బయిండుతో—రెండుమాసముల కొక్క చక్కని నవల. నడుమ నడుమ చిన్నచిన్న అనుబంధగ్రంథములు వెలువడుచుండును. చందాదారులకు ప్రవేశరుసుము రు 0_4_0 చందాదారులు ఒకేసారి రు 7_8_0 ను ముందుగా పంపినచో వరుసగా ఆపుస్తకములు అన్ రిజష్టర్డు పార్శిలుగా పంపుదుము.

ఇంతవరకు వెలువడిన గ్రంథములు

11 ప్రేమసుందరి	1 8 0	26 జాగిలము	1 8 0	41 ఛిన్నహస్తము (2 వ భాగము)	1 8 0
12 చోరశిఖామణి	1 8 0	27 మొగలాయిదర్బారు 2 భా॥	1 8 0	42 కంకణరహస్యము	1 8 0
13 లక్ష్మీప్రసాదము	1 8 0	28 సరస్వతి	1 8 0	43 సంజీవి (1 వ భాగము)	1 8 0
14 హత్యారహస్యము	1 8 0	29 ఆనందాభాయి	1 8 0	44 సంజీవి (2 వ భాగము)	1 8 0
51 పాస్టు (1 వ భాగము)	1 8 0	30 హత్యాన్వేషణము	1 8 0	45 వ్రజరాణి	1 8 0
16 ఫాస్టు (2 వ భాగము)	1 8 0	31 మొగలాయిదర్బారు 3 భా॥	1 8 0	46 హత్యాభ్రమ	1 8 0
17 కుముద్వతి	1 8 0	32 గంగ	1 8 0	47 కాశీఖండము	1 8 0
18 చిన్నకోడలు	1 8 0	33 మొగలాయీ దర్బారు 4 భా॥	1 8 0	48 సేవాశ్రమము (1 వ భాగము)	1 8 0
19 రహస్యభేదనము	1 8 0	34 కోహినూరు	1 8 0	49 సేవాశ్రమము (2 వ భాగము)	1 8 0
20 సింహగడము	1 8 0	35 ఆటిన్ మసేలా	1 8 0	50 దాసీకన్య	1 8 0
21 మణిహారము	1 8 0	36 అపరిచిత	1 8 0	51 స్త్రీ సాహసము ప్రథమభాగము	1 8 0
22 మొగలాయిదర్బారు 1 భా॥	1 8 0	37 అంతఃపురము (1 వ భాగము)	1 8 0	52 స్త్రీసాహసము 2 వ భాగము	1 8 0
23 ఘటికాచక్రము	1 8 0	38 అంతఃపురము (2 వ భాగము)	1 8 0	53 మేరీరాణి	1 8 0
24 రాజసుందరి	1 8 0	39 అగ్రహారము	1 8 0	54 రాజ్యలక్ష్మి	1 8 0
25 కుంకుమభరణి	1 8 0	40 ఛిన్నహస్తము (1 వ భాగము)	1 8 0	55 లీల	1 0 0

అనుబంధములు

1 మృత్యుతరంగిణి	0 12 0	10 శ్యామల	1 0 0	19 కథావళి	1 0 0
2 అభాగిని	0 12 0	11 కాంతంకథలు (చిన్నకథలు)	1 0 0	20 నాలుగుకథలు	1 0 0
3 ఛద్మవేషి	0 12 0	12 కాలసర్పి	1 0 0	21 నీతిప్రబోధిక	1 0 0
4 విదురుని యుపదేశములు	1 0 0	13 భారతకథాసారం	1 0 0	22 ఆదర్శము (1 వ భాగము)	0 12 0
5 కాంచనమాల	1 0 0	14 కథాకల్పవల్లి (చిన్నకథలు)	1 0 0	23 ఉదంకుడు	0 12 0
6 సీమంతిని	1 0 0	15 అరక్షణీయ	1 0 0	24 భేతాళకథలు	0 12 0
7 సుశీల	1 0 0	16 మాధవి	1 0 0	25 దయ్యాలు	0 12 0
8 శశిరేఖ	1 0 0	17 లలిత	1 0 0		
9 యమునాబాయి	1 0 0	18 పెండ్లిదండ	1 0 0		

నాటకములు

1 మార్కండేయ	0 12 0	5 షాజహాను	1 0 0	9 దంపతులు	1 0 0
2 అహల్యాశాపవిమోచనము	0 12 0	6 నూర్జహాను	1 0 0	10 విజయవిజయం	1 0 0
3 మేవారుపతనము	1 0 0	7 దుర్గాదాసు	1 0 0	11 భక్తకుచేల	1 0 0
4 వరమాల	1 0 0	8 చంద్రగుప్త	1 0 0		

ఈ గ్రంథములు రాజమండ్రీలో కలాభివర్ధనీ పరిషత్తులోను దొరకును